ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

సోమవారం 17 మార్చి 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.95	140	170
నల్లగొండ	రూ.100	145	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0 । కనిష్ఠం 21.4



ఈ ఉగాది నుంచే పేదలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో బియ్యం పక్కదారి పట్టకుండా కట్టుదిట్ట చర్యలు చేపట్టాలనే సూచనలు వస్తున్నాయి. ప్రధానంగా రేషన్ బియ్యం ఆధారంగా చేసుకొని బ్లాక్ మార్కెట్ నిర్వహిస్తున్న అక్రమార్కులకు పూర్తిగా చెక్‌పెట్టేలా పదునైన చట్టాన్ని రూపొందించడంతో పాటు, ఇచ్చిన బియ్యం వేరే మార్గంలో వెళ్తే గుర్తుపట్టేలా (బ్లూకిరోసిన్ తరహా) చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

40 శాతం పీడీఎస్ బియ్యం పక్కదారి

- సన్న బియ్యం పంపిణీకి కట్టుదిట్ట చర్యలు తీసుకుంటేనే ఉపయోగం..
- నిరుపేదలకు మాత్రమే రేషన్ బియ్యంతో ఆసరా
- గిరిజన తండాల్లో సొంత అవసరాలకే
- కూలీలు, సన్నకారు రైతులు సైతం
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో ఆసక్తికర అంశాలు
- నాలుగు భిన్నమైన గ్రామాల్లో సర్వే

ప్రస్తుతం ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న పీడీఎస్ బియ్యంలో సుమారు 40శాతంమేర బ్లాక్‌మార్కెట్‌కు తరలుతోంది. తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వందల కోట్ల రూపాయల విలువైన ఈఅక్రమదందాకు రేషన్ బియ్యం నెలవుగా మారిందనే ఆరోపణలున్నాయి. పేదవర్గాలకు చెందినవారు సైతంనేరుగా ఈ బియ్యాన్ని ఆహారంగా వినియోగించకపోవడాన్ని ఆసరా చేసుకొని అక్రమార్కులు ఊరూరా మాటు వేసి సేకరించడమే వృత్తిగా పెట్టుకున్నారు. ఈ బియ్యాన్ని అక్రమమార్గంలో సేకరిస్తున్న దళారులు మద్యం కంపెనీలకు, పొరుగు దేశాలకు, తిరిగి సీఎంఆర్ ద్వారా ప్రభుత్వానికి అందిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. రేషన్ బియ్యం వక్రమార్గం పట్టకుండా ప్రభుత్వయంత్రాంగం పలు చర్యలు చేపడుతున్నా, అవన్నీ కంటితుడుపుగానే ఉంటున్నాయే తప్పపక్కదారి పట్టకుండా నిలువరించలేకపోతున్నారు. ప్రజాప్రతినిధులు, పోలీసులు, అధికారులు సైతం ఈ బియ్యం నియంత్రణలో చిత్తశుద్ధితో వ్యవహరించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో రేషన్ బియ్యంలో ఎంత మేర పక్కదారి పడుతుందనే అంశంపై 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయి పరిశీలన చేయగా, పలు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి.

పక్కదారిపడుతున్న బియ్యం

వ్యవసాయాధారిత ప్రాంతమైన జిల్లా కావడంతో పాటు, రేషన్ కార్డులు ఇచ్చిన సమయంకంటే ప్రస్తుతం వరిసాగు పెరిగింది. బీపీఎల్ పరిధి దాటినా పెద్ద సంఖ్యలో కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉండడం, తదితర కారణాలతో జిల్లాలో పీడీఎస్ బియ్యం వినియోగం 60శాతానికి మించడం లేదని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేసిన పరిశీలనలోనూ ఈ విషయం బలపడింది. ఉమ్మడి జిల్లాలో భిన్నమైన ప్రాంతాల్లో, భిన్నమైన నమూనాలు సేకరించి సర్వే నిర్వహించగా, సగటున ఉమ్మడి జిల్లాలో 40శాతం వరకు రేషన్‌బియ్యం తిరిగి దళారులకు, వ్యాపారుల వద్దకు చేరుతున్నట్టు స్పష్టమైంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 10.08లక్షల రేషన్‌కార్డులకు ప్రతినెలా 18 వేల మెట్రిక్‌టన్నులకు పైగా రేషన్‌బియ్యం పంపిణీ అవుతోంది.



పట్టణాలు, గ్రామాల నుంచే పక్కదారి..

గ్రామాలు, పట్టణాల్లో అనర్హులైనవారు, కార్డులు పొందినప్పుడు బీపీఎల్ స్థితిలో ఉండి, ఇప్పుడు ఆ స్థాయి దాటి సన్నబియ్యం తింటున్నవారు ఉన్నారు. వారికొస్తున్న బియ్యాన్ని నేరుగా దళారీలకు అప్పగిస్తున్నారు. ఈ తరహా పట్టణాల్లో, పెద్ద గ్రామాల్లో ఎక్కువగా ఉన్నారు. పట్టణాలు, గ్రామాల్లో బియ్యాన్ని నేరుగా ఆహారంగా వాడే వినియోగదారులు 20శాతం వరకు ఉంటే, రొట్టెలకు, పశువుల దాణాకు వినియోగిస్తున్నవారు 30శాతం వరకు ఉన్నారు. మరో 10శాతం మంది వారి వద్ద పనిచేసే కార్మికులకు, ఇంటిపనివారికి, కూలీలకు ఉచితంగా గానీ, లేదా నామమాత్రపు ధరకు గానీ అందిస్తున్నారు. మరో 40శాతం వరకు బియ్యం మాత్రం పక్కాగా పక్కదారి పడుతోంది.

నిరుపేదలకు ఆసరా అవుతున్న రేషన్ బియ్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్‌బియ్యం వినియోగంపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలన చేసింది. రేషన్ బియ్యం పొందుతున్న 400 అతిపేద కుటుంబాలను (వ్యవసాయకూలీలు, వృత్తిపనులు చేసేవారు, పట్టణాల్లో అడ్డాకూలీలు, కార్మికులు, గుమాస్తాలు) పలకరించింది. వీరిలో ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీ వర్గాలకు చెందినవారు 90 శాతం వరకు ఉన్నారు. వీరిలో 74 శాతం మంది వారికొచ్చే బియ్యాన్ని నేరుగా వండి తింటుండగా, మిగిలిన 26శాతం కుటుంబాల వారు ఆ బియ్యాన్ని పిండిగా మార్చుకొని దోశ, జొన్నపిండితో కలిపి రొట్టెలుగా వినియోగిస్తున్నారు.

గిరిజన తండాల్లో రొట్టెలుగా..

గిరిజన తండాలకు చెందిన 200 కుటుంబాలను పలకరించగా, వారిలో 146 కుటుంబాల...

- మిగతా 7వ పేజీలో...



నేటికీ అందని రేషన్ బియ్యం

- సరఫరాలో ఆలస్యమే కారణం
- ఎంఎల్ఎస్ పాయింట్లలో స్టాక్ లేకపోవడంతో ఆలస్యం
- వచ్చే నెల నుంచి సన్నబియ్యం ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం
- మిల్లర్ల నుంచి సేకరించి సరఫరా చేస్తున్న వైనం

పేదలకు ప్రభుత్వం రేషన్‌దుకాణాల ద్వారా బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. ప్రతి నెలా 1నుంచి 25వ తేదీలోపు రేషన్ డీలర్లు బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయాలి. అయితే ఈ నెల మాత్రం తొలి విడత రేషన్ బియ్యం డీలర్లకే పూర్తిస్థాయి అందలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఇంకా చాలా మంది లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందలేదు. బియ్యం కొరతకు అధికారుల నిర్లక్ష్యమే కారణమనే విమర్శలు వస్తున్నాయి. గోదాంలో నిల్వ ఉన్న బియ్యాన్ని సరిహద్దు జిల్లా అయిన ఖమ్మం జిల్లాకు తరలించారని, దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు పంపిణీ చేసే బియ్యంలో కొరత ఏర్పడిందని సమాచారం.

- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట కలెక్టరేట్, భువనగిరి కలెక్టరేట్)

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 610 రేషన్‌దుకాణాలు, 3,05,564 రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల్లో సుమారు 8.79లక్షల మంది లబ్ధిదారులు ఉండగా, ప్రతి నెలా సుమారు 4,750 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీచేస్తున్నారు. అయితే ఈ నెలలో మాత్రం జిల్లాలో తొలి విడత డీలర్లు రావాల్సిన బియ్యం సరఫరా కాలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతానికి 3వేల మెట్రిక్ టన్నులకు పైగా రేషన్ దుకాణాలకు విడతలవారీగా బియ్యం సరఫరా చేశారు. ఇంకా మిగిలిన బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంది. నల్లగొండ జిల్లాలో మొత్తం 997 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటికి ఎనిమిది గోదాముల నుంచి బియ్యం సరఫరా చేస్తారు. మిర్యాలగూడ, నల్లగొండ, పెద్దవూర, దేవరకొండ, నకిరేకల్, నిడమనూరు, చండూరు, నాంపల్లి మండలాల్లో ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రతీ నెల 6,750 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ ...

- మిగతా 7వ పేజీలో...

ప్రశ్నపత్రాల ప్యాకింగ్ నిర్లక్ష్యంపై

ఇంటర్‌బోర్డ్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- సంబంధిత కేంద్రం సీఎస్, డీవో నుంచి వివరణ తీసుకోవాలని ఆదేశం
- పొరపాటున బండిల్స్ వచ్చాయంటున్న అధికారులు

నల్లగొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఇంటర్ ప్రశ్నపత్రాల ప్యాకింగ్‌లో నిర్లక్ష్యంపై ఇంటర్‌బోర్డు అధికారులు స్పందించారు. ఆరో రోజు పరీక్షా పత్రాల కవర్‌లో ఏడోరోజుకు సంబంధించిన ఒకేషనల్ ప్రశ్నపత్రాలుండగా, వాటిని గ్రహించి తిరిగి పోలీస్ కస్టడీకి పంపిన విషయాన్ని నిర్ధారించారు. ఈ విషయంపై పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి నుంచి ఆదివారమే జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి వివరణ తీసుకోవాలని ఇంటర్‌బోర్డు కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. 'ఇంటర్ ప్రశ్నపత్రాల ప్యాకింగ్‌లో నిర్లక్ష్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఆదివారం కథనం ప్రచురించగా, దీనిపై తీవ్రస్థాయిలో చర్చ సాగింది. చివరికి అధికారులు స్పందించారు. ఈ విషయమై నల్లగొండ ఇంటర్ విద్యాశాఖాధికారి దస్రునాయక్‌ను వివరణ కోరగా, ప్రశ్నపత్రాలు లీక్‌కాలేదని, ఆరో రోజు బండిల్స్‌తో పాటు, ఏడో రోజు బండిల్స్ వచ్చాయని తెలిపారు. ఇది ఆ కేంద్రం నిర్వాహకుల వైఫల్యమేనని, వారి నుంచి వివరణ కూడా తీసుకొని ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు. ఆ రోజే ఆ బండిల్స్‌ను వెంటనే పోలీస్ కస్టడీకి పంపామని తెలిపారు. విషయాన్ని అదే రోజు జిల్లా అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ గ్రహించినా బయటికి పొక్కకుండా జాగ్రత్తపడ్డారని, అందువల్లే పేపర్ లీకవడం వంటి దురదృష్టకర ఘటన జరగలేదని పలువురు అభిప్రాయపడ్డారు. జిల్లాలో ప్రశ్నపత్రాల పంపిణీ విధానం కూడా సక్రమంగా లేదని పలువురు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తెచ్చారు. ప్రత్యేక వాహనాల్లో వీటిని పరీక్షా కేంద్రాలకు తరలించాల్సి ఉండగా, ఉమ్మడి జిల్లాలో ఈ విధానం సక్రమంగా పాటించడం లేదని చెప్పారు. ఆటోల్లో, బైక్‌లపై ప్రశ్నపత్రాలు తీసుకువస్తున్నారని, దీనిపై కలెక్టర్లు సహా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

వేసవిలో ఇబ్బందులు లేకుండా చూడాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో జిల్లాలో సాగు, తాగునీరు, విద్యుత్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లాలో సాగునీటి సౌకర్యంతోపాటు సుమారు లక్ష ఎకరాల ఆయకట్టు పెరిగిందని, ఫలితంగా విద్యుత్‌కు డిమాండ్ సైతం పెరిగిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సాగు, తాగునీరు, విద్యుత్ ఇబ్బందులు ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది వరి దిగుబడి భారీగా వచ్చే అవకాశం ఉన్నందున ఐకేపీ కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, టార్పాలీన్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వ్యవసాయశాఖకు 80 క్లస్టర్లు, ఏఈ పోస్టులు మంజూరు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మంత్రి దృష్టికి తీసుకురాగా, వ్యవసాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడి క్లస్టర్లను మంజూరు చేయాలని కోరడంతో అందుకు ఆయన సమ్మతించారు. నెలలోపు క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటించారు. నల్లగొండ పట్టణంతో పాటు, గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ కోతలు ఉండవద్దన్నారు. వచ్చే నెల 1 లేదా 2న రూ.36కోట్లతో నిర్మించనున్న కలెక్టర్ కార్యాలయ అదనపు భవనాల నిర్మాణాలకు, 15 విద్యుత్ సబ్‌స్టేషన్లు, మాడుగులపల్లి పోలీస్‌స్టేషన్ భవనం, ఇతర కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్టు తెలిపారు. జిల్లా కేంద్రంలో కొత్త పోలీస్ క్వార్టర్ల నిర్మాణానికి అనుమతి రానున్నదని, డీఎస్పీ కార్యాలయం మంజూరైనందున శంకుస్థాపన చేస్తామన్నారు. రూ.520కోట్లతో మంజూరైన బైపాస్ రోడ్డుకు టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎమ్మార్పీ, ఎస్ఎల్‌బీసీ హైలెవెల్ కెనాల్ ద్వారా అందిస్తున్న సాగునీరు, పంటల పరిస్థితి, తాగునీరు, విద్యుత్, తదితర అంశాలను మంత్రికి వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి శ్రవణ్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మంత్రి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో 'ప్రజావాణి' నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆయకట్టు చివరి వరకూ నీరు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, తిప్పర్తి): ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మామిడాల గ్రామ చెరువును ఆయన పరిశీలించారు. సాగునీటి సమస్యకు కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. డీ-40 కాల్వ కింద ఉన్న 11-ఎల్ మైనర్ కాల్వ ద్వారా చెరువుకు చేరాల్సిన నీరు పూర్తిస్థాయిలో రావడంలేదని, దీనికి కొందరు కాల్వను పూడ్చడమే కారణమని రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి స్పందించి వెంటనే సాగునీరు చెరువులోకి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఆదేశించారు. గ్రామానికి చెందిన నిరుపేద మహిళ ముత్తం రాజేశ్వరి చెరువు పక్కనే పూరిగుడిసెలో నివాసం ఉంటుండగా, ఆమెకు వచ్చే దఫాలో ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని ఎంపీడీవో ఎ.వెంకటేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. తాత్కాలికంగా రేకులతో ఇంటి నిర్మాణం చేసుకునేందుకు రూ.50వేల ఆర్థిక సాయం చేయాలని సూచించారు. మంత్రి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నాగులవంచ లింగారావు, పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, బొల్లెద్దు నాగారాణి అంబేడ్కర్, ఈదయ్య, ఉన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

(ఆంధ్రజ్యోతి, కనగల్): రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం కనగల్ మైలసముద్రం చెరువుతో పాటు ఏఎమ్మార్పీ డిస్ట్రిబ్యూటరీ-25 పరిధిలోని 6-ఎల్ మైనర్ కాల్వను ఆయన పరిశీలించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఏఎమ్మార్పీ కింద 2.20లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, ప్రస్తుతం 2.15లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతోందన్నారు. ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిధిలోని ఏఎమ్మార్పీ మైనర్ కాల్వలను రైతుల కోరిక మేరకు రూ.90లక్షలు సొంత నిధులతో పనులను చేపట్టి పూర్తిచేయించానన్నారు. రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్‌పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ, డిస్ట్రిబ్యూటరీల ఆధునీకరణ, లైనింగ్ పనులకు రూ.1,000కోట్లతో త్వరలో ప్రభుత్వం టెండర్లు పిలవనుందని తెలిపారు. పొనుగోడు, నర్సింగ్‌భట్ల, కంచనపల్లి,బక్కసాయికుంట ఎత్తిపోతల పథకాలకు ఈనెల 28న శంకుస్థాపన చేస్తానన్నారు. కార్యక్రమంలో అధికారులతోపాటు మాజీ జడ్పీటీసీలు నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, మందడి రాంచంద్రారెడ్డి, గడ్డం అనూప్‌రెడ్డి, భిక్షంయాదవ్, గోలి జగాల్‌రెడ్డి, నర్సింగ్ కృష్ణయ్య గౌడ్, మురళిగౌడ్, భారతివెంకన్న, వెంకట్‌రెడ్డి, రాజురెడ్డి, దిలీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో అభివృద్ధే ధ్యేయం



కృతజ్ఞతా సభలో డప్పు కొడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వేదికపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు

తుంగతుర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసినందుకు ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఆదివారం తుంగతుర్తిలో ఎమ్మెల్యే మందుల సామేలు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, అదేవిధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో త్వరలో చట్టం తేనుందన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్ ఉందని, 2026 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే సామేలు మాట్లాడారు.

కేఎన్‌ఎం డిగ్రీ కళాశాల సెమినార్‌కు సిద్ధం

- అర్థశాస్త్ర విభాగంలో జాతీయ సదస్సు
- హాజరుకానున్న విద్యావేత్తలు



సెమినార్‌కు సిద్ధమైన వేదిక

మిర్యాలగూడ టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి సెమినార్ సోమవారం ప్రారంభం కానుంది. ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సెంటర్ ఆధ్వర్యంలో అర్థశాస్త్ర విభాగంలో రెండు రోజుల పాటు ఈ సెమినార్ జరగనుంది. గ్రోత్ పొటెన్షియాలిటీస్ ఇన్ తెలంగాణ స్టేట్ ప్రాస్పెక్ట్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై నిర్వహించనున్న ఈ సెమినార్‌లో రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటునందించే పలు పరిశోధనాత్మక అంశాలతో కూడిన ప్రజెంటేషన్లు ఇవ్వనున్నారు.

హాజరు కానున్న ప్రముఖులు

అర్థశాస్త్ర విభాగం పంపిన ప్రాజెక్టును మెచ్చిన ఐసీఎస్ఎస్ఆర్‌సీ జాతీయస్థాయి సదస్సు నిర్వహించేందుకు కేఎస్‌ఎం ప్రభుత్వ కళాశాలను ఎంపిక చేసింది. ఈ సెమినార్‌కు దేశ నలుమూలల నుంచి విశ్వవిద్యాలయాల వీసీలు, ప్రొఫెసర్లు, కేంద్రీయ విద్యాలయాల అధిపతులు హాజరు కానున్నట్లు ఎకానమిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, సెమినార్ కన్వీనర్ నరేష్ గుమ్మడి తెలిపారు.

చరిత్రలో నిలిచిపోతుంది



పట్టణంలో జాతీయ స్థాయి సెమినార్ జరగడం చరిత్రలో నిలిచిపోయే విషయం. అర్థశాస్త్రమంటే ఆర్థిక ప్రగతికి మూలం. అటువంటి అంశంపై సదస్సుకు కళాశాల ఎంపిక కావడం నిజంగా గొప్ప విషయం. ఐటీ, ఐ-పాస్, ఫైనాన్షియల్, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రికల్చర్, జీఎస్‌డీపీ, ట్రాన్స్‌పోర్ట్ తదితర అంశాలపై సదస్సులో చర్చ జరగనుంది.

- డాక్టర్ నరేష్ గుమ్మడి, సెమినార్ కన్వీనర్, ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్

హైవేపై వారాంతపు రద్దీ



కేతేపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం వారాంతపు రద్దీ కొనసాగింది. శుక్రవారం హోలీ సందర్భంగా హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు వెళ్లిన ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు సోమవారం వారి విధులకు హాజరయ్యేందుకు ఆదివారం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో 65వ నెంబరు జాతీయ రహదారిపై హైదరాబాద్ లేన్ వాహనాలతో రద్దీగా మారింది. విజయవాడ లేన్‌లో అంతంతమాత్రంగా ఉన్న వాహనాలు హైదరాబాద్ లేన్‌లో మాత్రం బారులు తీశాయి. వాహనాల రద్దీ ఆదివారం మధ్యాహ్నం నుంచే ప్రారంభమవగా, సాయంత్రానికి మరింత పెరిగింది. దీంతో కొర్లపహాడ్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదిలాయి. వాహనాల రద్దీకి అనుగుణంగా టోల్‌ప్లాజాలోని 12టోల్ కౌంటర్లలో 7 హైదరాబాద్ వైపుకు వెళ్లే వాహనాలకు, ఐదు కౌంటర్లును విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు కేటాయించారు.

ఎల్లలు దాటిన 'ఇంటి రుచులు'

ఆమె చేతివంట రుచి ఎల్లలు దాటింది. ఆమె తయారు చేసే పిండివంటలకు విదేశాల్లోనూ గిరాకీ ఉంటోంది. విదేశాల్లో, మెట్రో నగరాల్లో స్థిరపడ్డ పలువురు ఆమె వద్ద చిరుతిండ్లు తయారు చేయించుకుని తీసుకెళ్లడం ఆమె వంటల ప్రత్యేకతకు నిదర్శనం. నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన సోమా దీప్తి తన ఇంట్లోనే తయారుచేసే పిండివంటలతో జీవనోపాధి పొందడమే కాకుండా, తనతో పాటు మరో ఎనిమిది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. భర్తని కోల్పోయి కుటుంబ పోషణ కోసం అనివార్యంగా హోమ్‌ఫుడ్స్ తయారుచేయడం మొదలుపెట్టిన దీప్తి అనతికాలంలోనే నాణ్యమైన పిండి వంటలతో అందరినీ ఆకట్టుకోవడమే కాకుండా, తాను నిలబడి మరికొందరికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలిచారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ ఫీచర్స్)



పిండి వంటలు తయారుచేస్తున్న దీప్తి, ఇతరులు

- తాను నిలబడి మరికొందరిని నిలబెట్టిన మహిళ
- కుటుంబ పోషణ కోసం హోమ్‌ఫుడ్స్ తయారీలోకి ప్రవేశం
- రుచి, నాణ్యతతో పేరుసాధించి విదేశాలకూ ఎగుమతి
- పనిలో సహాయపడేవారికి వేతనాలు కాకుండా భాగస్వామ్యమిచ్చిన వైనం
- తనతో పాటు నలుగురికి ఉపాధి కల్పించడం సంతోషమంటున్న సోమా దీప్తి

నల్లగొండ పట్టణానికి చెందిన సోమా దీప్తి భర్త లారీ ప్రమాదంలో చనిపోయారు. ఇద్దరు పిల్లలతో ఒంటరైన ఆమెకు ఏంచేయాలో దిక్కుతోచలేదు. ఆ సమయంలో తోబుట్టువులు, అత్తమ్మ అండగా నిలిచారు. ఆమెకు వచ్చిన పనినే జీవనోపాధిగా మలుచుకోవాలని సూచించారు. చెల్లి సహకారంతో 2018 నుంచి ఇంట్లోనే ఆర్డర్లపై పిండివంటలు చేయడం మొదలుపెట్టారు. అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో, నాణ్యత, చక్కటి రుచితో ఆమె తయారుచేసిన పిండివంటలకు అభిమానులు పెరిగిపోయారు. రకరకాల అప్పాలే కాకుండా పచ్చళ్లు, స్వీట్లు సైతం ఆర్డర్లపై తయారుచేస్తూ అనతికాలంలోనే పేరు సాధించారు.

నల్లగొండ పట్టణంలోని ప్రముఖులతో పాటు, డాక్టర్లు, ఇంజనీర్లు, ఉన్నతాధికారుల కుటుంబాల వారు ఆర్డర్లపై ఆమెతో వంటలు చేయించుకోవడం మొదలుపెట్టారు. ఆ నోటా, ఈ నోటా ఈమె వంటలకు పేరురావడంతో ఆర్డర్లు పెరిగి కుటుంబ పోషణకు భయపడాల్సిన పనిలేకుండాపోయింది. స్థానికులే కాకుండా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ఉండే నల్లగొండ వాసులూ ఈమె వంటలను ఫోన్లలో ఆర్డరిచ్చి తయారు చేయించుకొని పార్శిల్స్ ద్వారా తమవద్దకు తెప్పించుకుంటున్నారు.

విదేశాలకు దీప్తి వంటలు

దుబాయి, సింగపూర్ వంటి విదేశాలకు వెళ్లి స్థిరపడ్డవారు సైతం దీప్తికి ఆర్డరిచ్చి మరీ పిండి వంటలు తయారు చేయించుకొని తాముండే దేశాలకు తెప్పించుకుంటున్నారు. ఇలా ఇంటివంటల పేరుతో దీప్తి చేపట్టిన హోమ్‌ఫుడ్ బిజినెస్ ఎల్లలు దాటడంతో గిరాకీ పెరిగింది. దీంతో ఆమె దాన్ని వ్యాపారంలా మార్చుకొనే అవకాశమున్నా అలా చేయకుండా ఇక్కడ భిన్నత్వాన్ని చాటి ఆదర్శంగా నిలిచింది. తనతో పాటు తన చెల్లి మురారిశెట్టి నందినితో పాటు మరో ఎనిమిదిమందిని భాగస్వాములను చేసుకొంది. వంటలు చేయడానికి అవసరమైన సామాగ్రి, ఉపకరణాలు అన్నింటినీ తానే సమకూర్చుకోవడంతో పాటు, తన ఇంట్లోనే వంటలను తయారుచేసేందుకు సదుపాయాలు అందుబాటులోకి తెచ్చింది. ఇంటిరుచులు పేరుతో హోమ్‌ఫుడ్ తయారీని చేపట్టింది. పెట్టుబడి, మార్కెటింగ్ అంతా తామే చూసుకుంటున్నప్పటికీ తనతో పాటు భాగస్వాములుగా చేర్చుకున్నవారికి వేతనాలు కాకుండా తనతో పాటు సమానంగా లాభాలు అందిస్తూ అందరికీ ఉపాధి కల్పిస్తోంది. ఇక్కడ వారి శ్రమ తక్కువ కాదని, తన శ్రమ ఎక్కువేమీ లేదని, అందరమూ సమానంగా కష్టపడుతున్నామని, ఒకరం ఎక్కువ, ఒకరం తక్కువ ఏమీ లేదని అందరి కష్టం ఫలిస్తేనే నాలుగుకాలాల పాటు అందరమూ సంతోషంగా ఉంటామనేది తమ విధానమని దీప్తి ఆంధ్రజ్యోతితో పేర్కొన్నారు. తమ ఇంటిరుచులకు ఇంత పేరు రావడానికి కారణమైన నాణ్యతని, నమ్మకాన్ని పోగొట్టుకోకుండా పిండివంటలు తయారు చేస్తున్నామన్నారు. ఆరంభంలో రోజుకు ఒకటి, రెండు ఆర్డర్లు వచ్చేవని, పెళ్లిళ్ల సీజన్లలో నాలుగైదు పెళ్లిళ్లకు ఆర్డర్లు వచ్చేవని క్రమంగా పేరురావడంతో ఇప్పుడు రోజుకు 30 దాకా ఆర్డర్లు వస్తున్నాయని, పెళ్లిళ్ల సీజన్లలో అయితే ఊపిరిసల పని పని ఉంటోందని, ఇదంతా అందరి సహకారంతోనే సాధ్యమైందని ముందుందుకూడా ఇలాగే చక్కటి రుచి, నాణ్యతతో పిండివంటలు అందించడమే లక్ష్యమని ఇంటిరుచుల నిర్వాహకులు దీప్తి తదితరులు పేర్కొన్నారు.

ఉపాధి కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉంది



నా కుటుంబ పోషణ కోసం ఇంటిరుచులు హోమ్‌ఫుడ్స్ సరఫరా ఇప్పుడు మాకుటుంబంతో పాటు మరికొన్ని కుటుంబాలకు జీవనోపాధిగా నిలవడం సంతోషం కలిగిస్తోంది. మొదటి రోజున ఏ రకమైన నాణ్యత, రుచితో పిండివంటలు అందించామో ఈ రోజుకూ అదే రుచిని, నాణ్యతని అందిస్తూ వస్తున్నాం. ఇది వ్యాపారం కాదు. నేను యజమానురాలిని కాదు. ఏ ఆర్డర్ వచ్చినా అందరం కలిసిమెలిసి వాటిని తయారుచేస్తాం. పెట్టుబడి పోను మిగిలిన ఆదాయాన్ని అందరం సమానంగా పంచుకొంటాం. ఇందులో ఒకరం ఎక్కువా కాదు. ఇంకొకరం తక్కువా కాదు. అందరి కష్టం, శ్రమతోనే ఈ పేరు సాధించాం. దీన్ని ఇలాగే కొనసాగిస్తాం.

- సోమా దీప్తి, ఇంటిరుచులు నిర్వాహకురాలు, నల్లగొండ

అక్కకు సహాయంగా వచ్చి భాగస్వామిని అయ్యా



ఆరంభంలో మా అక్కకు సహాయకురాలిగా ఉండేవాళ్లం. ఆమెకు ఆర్డర్లు తేవడం, సామాగ్రి అందించడం, తయారయ్యాక డెలివరీ ఇవ్వడం వంటి పనుల్లో సహాయపడేదాన్ని. క్రమంగా ఆర్డర్లు పెరగడంతో ఆమె ప్రోద్బలంతోనే మెల్లగా ఇందులో నేనూ భాగస్వామురాలినయ్యా. నేనే కాదు నాతో పాటు మరో ఏడుగురు కూడా కలిసి పనిచేస్తున్నాం. అందరం కలిసిమెలిసి ఉంటాం. ఆర్డర్ రాగానే పరిశుభ్రమైన వాతావరణంలో, నాణ్యత, రుచితో వాటిని తయారుచేసి సకాలంలో వాటిని డెలివరీ చేస్తాం. నన్నే కాదు ఈ ఇంటిరుచుల్లో పాలుపంచుకునే అందరినీ మా అక్క తోబుట్టువుల్లానే చూసుకుంటుంది. ఎవరినీ ఎక్కువగా, తక్కువగా చూడకపోవడం వల్లే దినదిన ప్రవర్ధమానంగా ఆర్డర్లు పెరుగుతూ వచ్చాయి.

- మురారిశెట్టి నందిని, ఇంటిరుచులు నిర్వాహకురాలు, నల్లగొండ


చేతబడి నెపంతో దాడి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



హనుమంతు(ఫైల్‌ఫొటో)

చివ్వెంల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : చేతబడి చేస్తున్నాడన్న అనుమానంతో చేసిన దాడిలో గాయపడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చివ్వెంల మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన మోతె హనుమంతు(65) ఫిబ్రవరి 21వ తేదీ సాయంత్రం గ్రామ సమీపంలోని బ్రిడ్జి కింద ఉన్న నీటిగుంటలో చేపలు పడుతున్నాడు. అదే సమయంలో హనుమంతు తనపై చేతబడి చేస్తున్నాడని కక్ష పెంచుకున్న మండలంలోని మోదినిపురం గ్రామానికి చెందిన రెవెల్లి మహేష్ బీరుసీసాతో గొంతులో పొడిచాడు. గాయపడ్డ హనుమంతును ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. హనుమంతు కుమారుడు దశరథ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



మేతకు తహతహ

వేసవి ఆరంభానికి ముందే ఎండల తీవ్రత పెరిగింది. ఇటీవల భూగర్భజలాలు అడుగంటాయి. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామచెరువులో నీరు అడుగంటింది. ఎండిన పొలం, చెరువులో మేతమేస్తున్న మూగజీవాలు

స్టాఫ్ ఫొటో గ్రాఫర్ యాదాద్రి- ఆంధ్రజ్యోతి

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

దామరచర్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలో జరిగింది. నల్లగొండ రైల్వే ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలకేంద్రం శివారులోని విష్ణుపురం, కొండ్రపోల్ రైల్వేస్టేషన్ల మధ్యలో గుర్తుతెలియని రైలు కింద పడి వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే సిబ్బంది సమాచారం రైల్వే పోలీసులకు అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడికి సంబంధించిన వివరాలు లభ్యం కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

క్రషర్ పరిశ్రమలో వ్యక్తి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులో క్రషర్ పరిశ్రమలో పని చేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన కాజల్ పహరియా(24) దండుమల్కాపురం శివారులోని రఫీజాన్‌మెటల్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పరిశ్రమ సమీపంలో బహిరంగ ప్రదేశంలోని ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు.

కార్మికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేవు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు

భువనగిరి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొన్న ఘటనలో తల్లి అక్కడికక్కడే మృతి చెందగా కుమార్తె తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి శివారులో జరిగింది. స్థానికులు, రూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన ఉల్లోజు వెంకటేశ్, భార్య కల్పన దంపతులకు ముగ్గురు కుమార్తెలు. ఆరేళ్ల కిందట బతుకుదెరువు కోసం భువనగిరి శివారులోని రాయిగిరిలో ఉంటూ కార్పెంటర్ పనిచేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ఆదివారం ఉదయం పనినిమిత్తం కల్పన(32), పెద్దకుమార్తె భావన కలిసి రాయిగిరి వద్ద జాతీయ రహదారి దాటుతున్న క్రమంలో వరంగల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు అజాగ్రత్తగా వెళ్తున్న బైక్ వీరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో కల్పన అక్కడికక్కడే మృతి చెందగా భావన తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు భావనను 108 అంబులెన్స్‌లో భువనగిరిలోని ఏరియా ఆసుపత్రికి తరలించి, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు.



కల్పన(ఫైల్‌ఫొటో), బైక్ ఢీకొనడంతో రోడ్డుపై పడిన కల్పన, భావన

ఐదు రోజుల్లో పది పరీక్షలు

ఉల్లోజు భావన రాజాపేట మండల కేంద్రంలో తన బాబాయ్ ఇంట్లోనే ఉంటూ అక్కడి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శనివారం రాయిగిరిలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఆదివారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. మరో ఐదురోజుల్లో పదో తరగతి పరీక్షలు ఉండగా భావన ప్రమాదబారిన పడడంతో కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. కల్పన భర్త వెంకటేశ్ ఫిర్యాదు మేరకు బైక్ యజమాని ముత్యాల శ్రీధర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

బైక్, బొలెరో ఢీకొని ఇద్దరికి గాయాలు

మర్రిగూడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో బైక్, బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. రాజుపేటతండాకు చెందిన జింకల దినేష్, వట్టిపల్లి గ్రామానికి చెందిన సిరికొండ నవీన్ కలిసి మర్రిగూడ మండలం నుంచి బైక్‌పై బట్లపల్లికి వెళ్తున్నారు. అదే సమయంలో మర్రిగూడ వైపు వస్తున్న బొలెరో వాహనం బట్లపల్లి సమీపంలో ఆంజనేయస్వామి గుడి వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో దినేష్, నవీన్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు చికిత్సనిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి..

గరిడేపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. నేరేడుచర్ల పట్టణానికి చెందిన అంకతి సతీష్ గరిడేపల్లి నుంచి నేరేడుచర్లకు బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన కొదమగుండ్ల అనిల్‌కుమార్ తన బైక్‌పై నేరేడుచర్ల వైపు వస్తున్నాడు. ఎల్బీనగర్ వద్ద ముందు బైక్‌పై వెళ్తున్న అంకతి సతీష్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనక బైక్‌పై ఉన్న అనిల్‌కుమార్ ఢీకొట్టాడు. దీంతో సతీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. అనిల్‌కుమార్ స్వల్పగాయలతో బయటపడ్డాడు. స్థానికులు వెంటనే 108 వాహనంలో సతీష్‌ను మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు. ఈఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

బైక్‌స్టాండ్ రోడ్డును తాకడంతో...

ఆత్మకూరు(ఎం) మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలకేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వలిగొండ మండలం మునగాల తుర్కపల్లి గ్రామానికి చెందిన డీసీఎం డ్రైవర్ ఎర్ర బాల్‌రాజ్ తన బైక్‌పై ఆదివారం ఆత్మకూరు(ఎం)కు వచ్చి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ స్టాండ్ తీయకపోవడంతో అది రోడ్డుకు తాకి బాల్‌రాజ్ కిందపడిపోయాడు. ప్రమాదంలో తలకు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ప్రథమ చికిత్స అనంతరం 108వాహనంలో భువనగిరి ఆసుపత్రికి తరలించారు.

సాగుబాట కష్టం చోరీలతో నష్టం



ముదిమాణిక్యం వద్ద పైప్‌కట్ చేసి మోటారు దొంగిలించిన ప్రాంతం ఇదే



- మోటార్లు, వైర్లు వరుస చోరీలు
- ఇప్పటికే రైతులపై సాగు అప్పులు

వరుస ప్రకృతి వైపరీత్యాలు, పంటలకు తెగుళ్లు, పెరిగిన పెట్టుబడులు, గిట్టుబాటు కాని వ్యవసాయంతో ఆర్థికంగా కుంగిపోయిన అన్నదాతకు కొత్త కష్టం వచ్చి పడింది. పొలాల వద్ద వ్యవసాయ మోటార్లు, వైర్లు ఈ మధ్య కాలంలో భారీగా చోరీకి గురవుతున్నాయి. వరుస సంఘటనలతో రైతన్నకు కంటిమీద కునుకు లేకుండాపోయింది.

- (ఆంధ్రజ్యోతి-త్రిపురారం)

నల్లగొండ జిల్లా త్రిపురారం మండలకేంద్రంలో దొంగలు పేట్రేగిపోతున్నారు. పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్లు ట్రాక్టర్ల బ్యాటరీలు ఎత్తుకుపోయిన దొంగలు తాజాగా మోటార్లు ఎత్తుకెళ్లారు. ఒక మోటారుతో పాటు సుమారు 20 మోటార్లకు సంబంధించిన వైర్లు ఎత్తుకెళ్లగా ముగ్గురు రైతులు మాత్రమే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు సమాచారం. చాలామంది రైతులు వైర్లకు దొంగతనం గురించి పోలీసుల వరకు వెళ్లినా పెద్దగా ప్రయోజనం ఉండదనే భావనలో ఉన్నారు. ఇదే అదునుగా దొంగలు వ్యవసాయ పరికరాలను లక్ష్యం చేసుకోవడంపై రైతుల్లో ఆందోళన నెలకొంది. దొంగిలించన వైర్లను కాల్చి దాంట్లో వచ్చే రాగి వైరును విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. రహదారుల వెంబటి కాకుండా లోపల ఉన్న పొలాల్లోని చాలా ప్రాంతాల్లో మద్యం సేవించే అడ్డాలు ఉన్నాయి. మద్యం తాగడానికి వచ్చి పగలు రెక్కీ నిర్వహించి రైతులు ఇంటికి వెళ్లగానే తమ చేతి వాటం ప్రదర్శిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇవే కాకుండా రెండు నెలల క్రితం బెజ్జికల్ ఎల్-4 కాల్వ సమీపంలో వరి నారు వేసుకుని వచ్చి పొలం వద్ద ఉంచిన ట్రాక్టర్‌కు సంబంధించిన కొత్త ట్రాలీ దొంగతనానికి గురైంది. దాని విలువ సుమారు రూ.2లక్షలు, ఇటీవల మాటూరు సమీపంలోని పొలం వద్ద ఉన్న ట్రాక్టర్, ట్రాలీ రెండు కలిపి ఎత్తుకువెళ్లారు. వాటి విలువ రూ.5లక్షల పైబడి ఉంటుందని ఇప్పటివరకు వాటి ఆచూకీ లభ్యం కాలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కదిలిస్తే కన్నీళ్లే..

వ్యవసాయం కష్టంగా మారిన పరిస్థితుల్లో మోటార్లు, వైర్లు దొంగతానికి గురి అవుతుండటంతో ఏ రైతుని కదిలించినా కన్నీళ్లే ఉబికి వస్తున్నాయి. మూడేళ్లగా వేసవి సమయంలో జనసం ... చారం ఉండకపోవడంతో సత్యనారాయణపురం సమీపంలోని తదితర ప్రాంతాల్లో వరుసగా మోటార్లు దొంగతనాలు జరిగాయి. అయినా ఇప్పటివరకు ఒక్కటీ రికవరీ కాలేదని రైతులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వ్యవసాయం చేయడం కష్టంగా మారిందని, దొంగతనాలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఒక్క రోజులో 10 వైర్లు, మోటారు

మండలకేంద్రంలోని రాజీవ్‌కాలనీ నుంచి ముదిమాణిక్యం మేజర్ కాల్వకు వెళ్లే దారిలోని పొలాల వద్ద 20 రోజుల కిందట 10 మోటార్లకు ఉన్న కాపర్‌వైర్లను ఒకేరోజు గుర్తుతెలియని వ్యక్తులు కోసుకుపోయారు. అదే దారిలోని పొలానికి చుట్టూవేసిన 50అడుగుల ఇనుప జాలీని దొంగిలించారు. అదేవిధంగా సోమిరెడ్డికి చెందిన రూ.20వేల మోటారు, అదే ప్రాంతంలోని 10 మోటార్ల వైరు చోరీకి గురైంది. ఒక్కో మోటారుకు సుమారు 7-10అడుగుల వైరు ఉంటుంది. వైరు అడుగుకు సుమారు 100 రూపాయల ఖరీదు ఉంటుంది. మోటారుకు 1000 రూపాయల వరకు రైతులు నష్టపోయారు. పోయిన వాటి స్థానంలో కొత్తవి తెచ్చి బిగించుకుంటున్నారు. దాంతో రైతులపై అదనపు భారం పడుతోంది.

మోటారు వైరు పోయింది



త్రిపురారం గ్రామసమీపంలోని తుంగపాడు మేజర్ వద్ద ఉన్న పొలంలోని బోరు వద్ద ఉన్న మోటారు వైరును దొంగలు కత్తిరించుకుపోయారు. చుట్టుప్రక్కల ఉన్న 10 మోటార్ల వైరు అదే రోజు పోయింది. ఏంచేయాలో అర్థంకావడం లేదు. దొంగతనాలకు పాల్పడి రైతులకు ఆర్థికంగా నష్టం కలిగిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలి.

- పీబీ రవి, త్రిపురారం

కనుకులేకుండాపోయింది



వరుస దొంగతనాలతో కంటి మీద కునుకు లేకుండాపోయింది. రాత్రిళ్లు మోటార్లు వద్ద కాపలా కాయాల్సి వస్తోంది. రైతులు లేని సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. రాజీవ్ కాలనీ సమీపంలో వ్యవసాయ పొలాల వద్ద ఉన్న మా మోటారు వైర్లను దొంగిలించారు..

- మజ్జిగపు వెంకట్‌రెడ్డి, త్రిపురారం,

మూడు టీంలు ఏర్పాటు చేశాం

దొంగతనాల నియంత్రణకు ప్రత్యేకంగా మూడు టీంలు ఏర్పాటు చేశాం. ఈ మధ్య కాలంలో మోటార్లు,వైర్లకు సంబంధించి మూడు చోరి కేసులు మా దృష్టికి వచ్చాయి. వాటికి సంబంధించిన కేసులు నమోదు చేసి విచారణ చేపట్టాం. రాత్రిళ్ల గస్తీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నాం.

- ప్రసాద్, ఎస్‌ఐ, త్రిపురారం

భూగర్భజలాలు అడుగంటి పొలాలు ఎండిపోతున్న తరుణంలో దొంగ ల బెడద రైతును కుంగదీస్తోంది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో గత నెల రోజుల్లో అధికారికంగా 15 మంది రైతుల వ్యవసాయ బావుల వద్ద కాపర్‌వైర్లను దొంగలు అపహరించారు. ఒక్కో కాపర్‌వైర్ రూ.5వేల నుంచి రూ.6వేల వరకు ఉంటుంది. లింగోటం, నేలపట్ల, మందోళ్లగూడెం, లింగోజీగూడెం, లింగారెడ్డి గ్రామాల్లో ఈ చోరీలు జరిగాయి. రెండు నెలల్లో 15 కేసులు నమోదయ్యాయి. ఫిర్యాదు చేయని రైతులు అనేక మంది ఉన్నారు. తరుచుగా దొంగలు మోటారు వైర్లను చోరీ చేస్తుండటం రైతులకు భారంగా మారింది. కాపర్‌వైర్ల చోరీకి పాల్పడ్డ ఐదుగురు దొంగలను పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు.

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ రూరల్)



ఎనిమిది జరిగితే రెండు కేసులు

(ఆంధ్రజ్యోతి-పెద్దఅడిశర్లపల్లి)

పీఏపల్లి మండలంలో రెండు నెలల్లో ఎనిమిది ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్‌వైరు, ఆయిల్ చోరీకి గురైంది. దీంతో పొలాలకు విద్యుత్‌సరఫరా నిలిచిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరుస దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పగటి పూట పక్షుల వేట కోసం వస్తున్న కొందరు చోరీలకు పాల్పడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. మోటార్లు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లలోని ఆయిల్ చోరీలతో సమయానికి నీరందక పంటలు దెబ్బతింటున్నాయని రైతులు తెలిపారు. చోరీల వెనక పెద్దముఠా ఉండి ఉండవచ్చని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లకు ఆన్ ఆఫ్ హ్యాండిల్స్ ఉండటంతో చోరీ సులభం అవుతుందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. రాత్రి వేళ ట్రాన్స్‌ఫార్మర్ ఆన్ చేసి హ్యాండిల్స్‌ను తమ వెంట తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. వరుస చోరీలతో విద్యుత్ అధికారులు చొరవ తీసుకుని తమ సిబ్బంది, పోలీసులతో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. దీంతో నెల రోజులుగా చోరీలు నిలిచిపోయాయి. ఎవరైనా అనుమానితులు పొలాల వెంట తిరుగుతుంటే పోలీసులకు సమాచారాం ఇవ్వాలని కోరుతున్నారు.



పీఏపల్లి మండలం ఘనిపల్లి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కిందపడేసి కాపర్‌వైర్‌ను చోరీ చేసిన దొంగలు

బత్తాయి, వరి పంట నష్టపోతున్న...



మా పొలంలో జనవరి 8న ట్రాన్స్‌ఫార్మర్‌ను విరగొట్టి అందులోని రాగి తీగను చోరీచేశారు.దీంతో సమయానికి నీరందక, బోరు పని చేయక వారం రోజుల పాటు నీటి సరఫరా కాలేదు. ఈ కారణంగా బత్తాయి, వరి పంట ఎండిపోయింది. చోరీకి గురైన రోజు విద్యుత్‌శాఖ, పోలీసులకు సమాచారం అందించా. దీంతో విద్యుత్ అధికారులు 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ అందించారు. పొలాలు ఎండిపోకుండా ఉండేందుకు ఒక్కో మోటార్‌ను నడుపుకుంటున్నా. పూర్తిస్థాయి 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ అందలేదు.

- బోయ వరదారెడ్డి, తిరుమలగిరి

ఆధార్‌తో నకిలీ ఓట్లకు చెక్

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానంతో నకిలీ ఓట్లకు చెక్ పెట్టవచ్చునంటున్నారు నిపుణులు. ఆధార్ అనుసంధానంతో నిజమైన ఓటర్ల సంఖ్య తెలియడంతో పాటు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అభిప్రాయ పడుతున్నారు. ఆక్రమంలో ఈ నెల 18న సీఈసీ ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానంపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రెండు ఓట్లు అనే నానుడికి చెక్ పెట్టటంతోపాటు, నిజమైన ఓటర్ల జాబితా వస్తుందని, జాబితాపై రాజకీయ నాయకుల తప్పుడు ప్రచారానికి అడుకట్ట వేయవచ్చునని పేర్కొంటున్నారు.

• (ఆంధ్రజ్యోతి, కోదాడ)


మంచి నిర్ణయం



ఓటర్ల జాబితాలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలనే సీఈసీ నిర్ణయం అభినందనీయం. ఓటర్ల జాబితాపై అటు ఓటర్లకు, ఇటు రాజకీయ నాయకులకు తప్పుడు అభిప్రాయం ఉంది. సీఈసీ తీసుకునే నిర్ణయంతో తెరపడనుంది. జాబితాపై రాజకీయ నాయకుల తప్పుడు ప్రచారానికి అడుకట్టవేయవచ్చు. అదేవిధంగా రెండు ఓట్లు అనే నానుడికి చెక్ పెట్టవచ్చు

-తేజా జానకిరామయ్య, ఉపాధ్యాయుడు కోదాడ.

రెండు ఓట్లు అనే ఆలోచన రాదు



ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడంతో ఓటరకు రెండు ఓట్లు నమోదు చేసుకోవాలనే ఆలోచన చేయరు. దీంతో ఓటర్ల జాబితా తప్పులు దొర్లే అవకాశం ఉండదు. నిజమైన ఓటర్ల లిస్టు ఉంటుంది. ఎప్పుడు ఎన్నికలు జరిగిన ఎలాగైనా గెలవాలనే రాజకీయనాయకుల ఆలోచనకు చెక్ పడుతుంది. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయం మంచిది.

-కుదరవెల్లి బసవయ్య, సామాజిక కార్యకర్త

వెసులుబాటు ఇవ్వాలి



ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలనే సీఈసీ నిర్ణయం మంచిది. నకిలీ ఓటరు నమోదు అయ్యే అవకాశం ఉండదు. ఓటరుపై ఆర్థిక భారం పడుకుండా కేంద్రప్రభుత్వమే భరించాలి. కాకపోతే ఓటర్లకు నిర్ధిష్ట సమయం నిర్ణయించకుండా, వెసులుబాటు కల్పించి, ప్రజలలో అవగాహన కల్పించితే నిజమైన ఓటర్ నమోదు అవుతుంది.

-పిట్టల భాగ్యమ్మ, కోదాడ.

కాంట్రాక్టర్లకు ఇవ్వొద్దు



ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలనే సీఈసీ నిర్ణయం హర్షించదగినది. అయినప్పటికీ ఆధార్ అనుసంధానం ప్రక్రియను ఓటర్ నుంచి డబ్బులు తీసుకునే కాంట్రాక్టర్లకు ఇవ్వొద్దు. ఓటర్‌పై ఆర్థికభారం పడుతుంది. ఫలితంగా ఓటరు కార్డుకు ఆధార్‌ను అనుసంధానం చేయాలనే ఆలోచనను ఓటర్ చేయడు. కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా నమోదు చేస్తే మంచిది.

-వంగవీటి రామారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్

మారుతున్న రూపురేఖలు

- **అమృత్ భారత్ స్టేషన్‌గా మిర్యాలగూడ**
- **శరవేగంగా అభివృద్ధి పనులు**

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

రైల్వే ప్రయాణికులకు ప్రపంచస్థాయి సౌకర్యాలను అందించే దిశగా అడుగులేస్తున్న కేంద్రప్రభుత్వం దేశంలోని పలు స్టేషన్లను ఆధునీకరిస్తోంది. వన్‌స్టేషన్ వన్ ప్రొడక్ట్ నినాదంతో అమృత్ భారత్ స్టేషన్ స్కీం (ఏబీఎస్ఎస్) పేరుతో చేపట్టిన ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలోని 15 రైల్వేస్టేషన్లు ఎంపిక చేశారు. వాటిలో పారిశ్రామిక పట్టణంగా పేరున్న మిర్యాలగూడతో పాటు జిల్లా కేంద్రమైన నల్లగొండకు చోటు దక్కింది. స్టేషన్ అభివృద్ధి కోసం రూ.9.50 కోట్లు కేటాయించగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాగా ఎంపికైన స్టేషన్లలో పునరాభివృద్ధి పనులను ప్రధాని మోదీ గతేడాది ఫిబ్రవరి 26వ తేదీన వర్చువల్‌గా ప్రారంభించారు.





మిర్యాలగూడ రైల్వేస్టేషన్ ముఖద్వారం, జరుగుతున్న అభివృద్ధి పనులు

అత్యాధునిక హంగులతో...

అమృత్ భారత్ స్టేషన్లను అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేసేందుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. ప్లాట్‌ఫాంల రీ మోడరైజేషన్, ఎంట్రెన్స్ కారు, బైక్ పార్కింగ్, స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్స్, సిట్టింగ్, ఫ్లోరింగ్ ఏరియాలను డెవలప్ చేయడంతో పాటు పార్కింగ్ స్థలాన్ని సుందరమయంగా మార్చనున్నారు. ఆయా స్టేషన్లలో ఎస్కలేటర్, లిఫ్ట్, ఆర్పీఎఫ్ బిల్డింగ్స్, రిఫ్రెష్‌మెంట్ రూమ్స్, ఆఫీసెస్, పే అండ్ యూస్ టాయిలెట్స్‌ను ఆధునిక హంగులతో నిర్మిస్తున్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపికైన అన్ని స్టేషన్లలోని ప్లాట్‌పాంలకు సీలింగ్ చేయడంతో పాటు ఆకర్షణీయమైన రంగులతో టైల్స్ వేస్తున్నారు.

ప్రయాణికులకు ఆహ్లాదం కలిగించేలా...

భూమిపై ప్రయాణాల్లో రైలు ప్రయాణమే సౌకర్యవంతంగా భావిస్తుంటారు ప్రయాణికులు. చికుబుకు చికుబుకు రైలు నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌గా అప్‌డేట్ అయిన రైళ్లల్లో ప్రయాణం వేగవంతంతో పాటు సుఖమయంగా ఉండాలని భావిస్తోంది రైల్వేశాఖ. అందుకే ఆధునిక హంగులతో స్టేషన్ల రూపురేఖలు మారుస్తోంది. ప్రయాణికులు వేచి ఉంటే ప్రాంతాలను సుందరంగా, సౌకర్యవంతంగా చేయనుంది. పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వడం, ప్రయాణికులకు అంతరాయం లేకుండా ఉచిత వైఫై అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఎగ్జిక్యూటివ్ లాంచ్‌ల ఏర్పాటుతో పాటు వృద్ధులు, దివ్యాంగుల కోసం ఆధునిక వీల్ చైర్లను అమృత్ స్టేషన్లలో అధికారులు ఏర్పాటు చేయనున్నారు.

స్టేషన్లలో మహిళా స్టాల్స్

రైల్వేస్టేషన్లలో మహిళా స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మగువలు స్వయంగా చేసిన ఆహార పదార్థాలు, వస్తుసామగ్రిని విక్రయించుకునేందుకు రైల్వేస్టేషన్లలో వేదికలను ఏర్పాటు చేస్తోంది. ఒక్కో స్టేషన్‌లో ఒక్కోలా (సికింద్రాబాద్‌లో పిండి వంటలు, వరంగల్‌లో త్రుణధాన్యాలు, ఘన్‌పూర్‌లో చేతి ఉత్పత్తులు, శంకర్‌పల్లిలో జూట్ బ్యాగులు) విక్రయాలు జరిపేలా స్టాళ్లను కేటాయించనున్నారు. వాటి నిర్వహణ బాధ్యతను పూర్తిగా మహిళలకే అప్పగించనున్నారు.

డబ్లింగ్‌కు శరవేగంగా ఏర్పాట్లు

పగిడిపల్లి నుంచి నల్లపాడు వరకు డబ్లింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారుగా 200 కిలోమీటర్ల మేర డబుల్ లైన్ నిర్మిస్తుండగా నియోజకవర్గంలో మట్టి పోత పనులు రేయింబవళ్లు సాగుతున్నాయి. హైదారాబాద్ - అమరావతి మధ్య కనెక్టివిటీ పెరగడంతో పాటు దేశంలోని నాలుగు ఆరు రాష్ట్రాలకు రైళ్ల ఉమ్మడి జిల్లాలోని ఇరు పట్టాలపై పరుగులెట్టనున్నాయి. ప్రతీ పదిహేను నిమిషాలకు (నల్లగొండ మిర్యాలగూడ స్టేషన్లలో ఆగినా, ఆగకపోయినా) ట్రైన్ రన్ అయ్యే అవకాశం ఉంటుందని స్థానిక రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు.



ఆధునిక హంగులతో ఏర్పాటు చేసిన లిఫ్ట్


రైల్వే చరిత్రలో నూతన అధ్యాయం



అమృత్ భారత్ స్టేషన్ పథకానికి మిర్యాలగూడ, నల్లగొండ ఎంపిక పారిశ్రామిక అభివృద్ధికి నాంది. రైల్వే వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన కేంద్రప్రభుత్వం ప్రయాణికులకు నాణ్యమైన ఆధునిక, నాణ్యమైన సేవలందించేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే స్టేషన్ రూపురేఖలు మారిపోయాయి. పనులు పూర్తయితే ప్రయాణికులకు పెరగడంతో పాటు ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది.

• చెరుపల్లి కరుణాకర్, మిర్యాలగూడ

గతంతో పోలిస్తే ఎన్నో మార్పులు



అమృత్ భారత్ స్టేషన్ పథకం పేరుతో జరుగుతున్న అభివృద్ధి ఆహ్వానించదగినది. ఇటీవల కాలంలో రైలు ప్రయాణంలో కొత్తదనం కనిపిస్తోంది. గతంతో పోలిస్తే ఎన్నో మార్పులు వచ్చాయి. వేగవంతమైన, సుఖమైన ప్రయాణం, నాణ్యతతో కూడిన సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను బట్టి చూస్తే భవిష్యత్తులో మరిన్ని మార్పులు వస్తాయని భావిస్తున్నా.

• శ్రీకాంత్ లకుమారపు, మిర్యాలగూడ

రిటైర్డు ఉద్యోగులకు కాంగ్రెస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం

- **మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు**
- **కోదాడలో విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు**

కోదాడ, కోదాడటౌన్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు కాంగ్రెస్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని భారీ నీటి పారుదలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ఆదివారం సూర్యాపేట జిల్లా కోదాడ పబ్లిక్ క్లబ్‌లో వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఒక రిటైర్డు ఉద్యోగినేనని అన్నారు. హెల్త్ కా ర్డులు విశ్రాంత ఉద్యోగుల న్యాయమైన కోరిక అని అన్నారు. ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఒకటో తేదీనే పింఛను, జీతాలు ఇస్తున్నట్లు తెలిపారు. రిటైర్డు ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించటం అభినందనీయమని అన్నారు. విశ్రాంత ఉద్యోగులకు మద్దతు ఉంటుందని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో 55 వేల పోస్టులను భర్తీ చేశామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు జరగలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సీనియారిటీ ఆధారంగా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రతి పని పారదర్శకంగా జరుగుతుందని చెప్పటానికి బదిలీలు, పదోన్నతులే నిదర్శనమని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజానికి మంచి బాటను విశ్రాంత ఉద్యోగులు చూపాలన్నారు. రిటైర్డు ఉద్యోగులకు క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించడం ఆదర్శనీయమని కొనియాడారు. గతంలో ఎమ్మెల్యేలకు కూడా క్రీడా పోటీలు ఉండేవని, ప్రస్తుతం సమయం లేక క్రీడలు ఆడలేకపోతున్నామని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించటం అభినందనీయమని అన్నారు. ఉద్యోగులుగా సమాజానికి మూడు, నాలుగు దశాబ్దాలు సేవలు అందించి, ఉద్యోగ విరమణ అనంతరం ఉపశమనం పొందేందుకు క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఆప్యాయత, ప్రేమాభిమానులు ఉన్నా ఉద్యోగం, చదువు రీత్యా పిల్లలు తల్లిదండ్రులతో ఉండే పరిస్థితి లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విశ్రాంత ఉద్యోగులు ఒకచోట చేరి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టటం సంతోషకరమని అన్నారు. రహదారుల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం, రైతులకు రైతుబంధుతో పాటు పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రిటైర్డు ఉద్యోగుల సలహాలు, సూచనలు తీసుకుని తమ ప్రభుత్వం పనిచేయడానికి కట్టుబడి ఉందన్నారు. అనంతరం రిటైర్డు ఉద్యోగుల హెల్త్‌కార్డులు, పీఆర్సీ, డీఏలు, ఇతర సమస్యలను మంత్రుల దృష్టికి ఆలిండియా పెన్షనర్స్ సమాఖ్య జనరల్ సెక్రటరీ డాక్టర్ సుధాకర్, రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి తీసుకువెళ్లారు. అనంతరం రిషి డ్యాన్స్ అకాడమీ చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఉద్యోగులు, కళాకారుల పాటలు, పౌరాణిక, ఏకపాత్రాభినయనాలతో సభా ప్రాంగణం మార్మోగింది. 33 జిల్లాల నుంచి వందలాది క్రీడాకారులు ఉత్సవాలకు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రావేళ్ల సీతారామయ్య, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, చంద్రశేఖర్, సుదర్శన్‌రెడ్డి, బొల్లు రాంబాబు, యర్నేని రామారావు, వేనేపల్లి శ్రీనివాస్, పట్టాభిరెడ్డి, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, షేక్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	519.20
టీఎంసీలు	147.8218
ఎడమకాల్వకు నీటి విడుదల	8454
కుడికాల్వకు	8023
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	10774 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	18277 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.58 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46 (టీఎంసీలు)
ప్రస్తుత నీటి మట్టం	630.35 అడుగులు
టీఎంసీలు	1.44 (టీఎంసీలు)
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	26.86 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	187.63 క్యూసెక్కులు

పీడీఎస్ బియ్యం 40 శాతం పక్కదారి

(5వ పేజీ తరువాయి)

వారు అంటే 73శాతం కుటుంబాలు ఈ బియ్యాన్ని జొన్నలతో కలిపి పిండి పట్టించుకొని రొట్టెలు చేసుకుంటున్నాయి. మిగిలినవారు నేరుగా బియ్యాన్ని వండుకొని తింటున్నామని తెలిపారు.

తండాల్లోనే అధికంగా వినియోగం..

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ఓ గిరిజన తండాలో రేషన్‌బియ్యం వాడకంపై 'ఆంధ్రజ్యోతి' సర్వే నిర్వహించింది. ఈ తండాలో 300 రేషన్‌కార్డులు ఉండగా, 1,200 యూనిట్లకు 7,200 కిలోల రేషన్‌బియ్యం ప్రతినెలా పంపిణీ అవుతోంది. ఇక్కడ బియ్యం ఆహారంగా వినియోగించడం కంటే సంప్రదాయ వంటకమైన రొట్టెలకు వినియోగిస్తున్నారు.

ఆయకట్టు గ్రామంలో పరిస్థితి ఇలా..

సూర్యాపేట జిల్లాలోని పూర్తి సాగునీటి వనరులు ఉండి, వరిధాన్యం దిగుమతయ్యే కోదాడ నియోజకవర్గంలోని ఓ గ్రామాన్ని 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా, ఇక్కడ పరిస్థితి మరోలా ఉంది. ఈ గ్రామంలో 1,050 రేషన్‌కార్డులు ఉండగా, 3,700యూనిట్లకు నెలనెలా 22,200కిలోల బియ్యం వస్తోంది. ఈ గ్రామంలో కూలిపనులకు వెళ్లే దాదాపు 240 కుటుంబాల వారు వారికి వచ్చే దాదాపు 4,300 (20శాతం) కిలోల రేషన్ బియ్యాన్ని యథాతథంగా ఆహారానికి వినియోగిస్తున్నారు. ఈ గ్రామం లో దాదాపు 6,500 కిలోల బియ్యం(30శాతం) తిరిగి అక్రమవ్యాపారులకు చేరుతోంది.

బోర్ల సేద్యమే ఉన్న గ్రామంలో 77శాతం వెనక్కే

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని ఓ గ్రామంలో రేషన్‌బియ్యం వినియోగంపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలన చేయగా, ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగుచూశాయి. బోరుబావుల సేద్యం ఎక్కువగా ఉండే ఈ గ్రామంలో 246 రేషన్‌కార్డులకు, 772 యూనిట్లుండగా, 47 క్వింటాళ్ల బియ్యం ప్రతినెలా వస్తోంది. ఈ గ్రామంలో కూలీ పనులకు వెళ్లే కుటుంబాలకు చెందిన సుమారు 50కుటుంబాల వారు సుమారు 11 క్వింటాళ్ల బియ్యం(23శాతం) మాత్రమే నేరుగా ఆహారానికి వినియోగిస్తుండగా, మిగిలిన 77శాతం బియ్యంలో 60శాతం వ్యాపారుల వద్దకే చేరుతోంది.

మెట్ట గ్రామంలో 20శాతమే వినియోగం

నల్లగొండ జిల్లాలోని దేవరకొండ నియోజకవర్గంలోని మెట్ట ప్రాంతంలోని ఓ గ్రామాన్ని 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా, పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ గ్రామంలో మొత్తం 360 రేషన్‌కార్డులు ఉండగా, 1,100 యూనిట్లకు 70 క్వింటాళ్ల రేషన్‌బియ్యం ప్రతినెలా వస్తోంది. ఈ గ్రామంలో బోరుబావుల కింద, మెట్ట సేద్యమే అధికం. ఇక్కడ కూలీపనులు చేసుకునేవారు, సన్నకారు వ్యవసాయ కుటుంబాలకు చెందిన 56 కుటుంబాలకు చెందిన వారు వారికి వచ్చే దాదాపు 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని (20శాతం) నేరుగా ఆహారానికి వినియోగిస్తున్నారు. మరో 80 కుటుంబాల వారు వారికి వచ్చే 18.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రొట్టెల పిండిగా, దోశల పిండిగా వాడుతున్నారు. మరో 30 వరకు కుటుంబాల వారు వారికి వచ్చే 7క్వింటాళ్ల బియ్యాన్ని (10శాతం) పశువుల దాణాగా వినియోగిస్తున్నారు. మిగిలిన 194 కుటుంబాలకు చెందిన 30.50 క్వింటాళ్ల (40శాతం) బియ్యం తిరిగి దళారులకు చేరుతోంది.

ఉమ్మడి జిల్లాలో పీడీఎస్ బియ్యం పంపిణీ ఇలా..

జిల్లా	రేషన్ కార్డులు	యూనిట్లు	వచ్చే బియ్యం (మెట్రిక్‌టన్నులు)
నల్లగొండ	4,46,420	13,80,425	8,300
సూర్యాపేట	3,25,111	9,27,560	5,600
యాదాద్రి	2,17,067	6,63,112	4,100
మొత్తం	10,08,598	29,71,097	18,000

పాము ఎదురొచ్చిందని..

- **సడన్ బ్రేక్ వేసిన లారీ డ్రైవర్** • **వెనుక నుంచి వస్తున్న బస్సు ఢీ**
- **బస్సులో 11 మంది ప్రయాణికులకు గాయాలు**

దేవరకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పాము లారీకి అడ్డంగా రావడంతో లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న 11 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా దేవరకొండలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. దేవరకొండ సీఐ నర్సింహులు, ఆర్టీసీ ఇన్‌చార్జి డీఎం సైదులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ బస్టాండ్ నుంచి మిర్యాలగూడకు వెళ్లే పల్లెవెలుగు బస్సు 48మంది ప్రయాణికులతో మిర్యాలగూడకు బయలుదేరింది. దేవరకొండ పట్టణ శివారు ఉప్పువాగు వద్దకు వెళ్లగానే ముందు వెళ్తున్న లారీ పాము అడ్డు రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ మహేష్ అప్రమత్తంగా వ్యవహరించి సడన్ బ్రేక్ వేశాడు. అయినా బస్సు ముందు ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సులో ఉన్న మిర్యాలగూడకు చెందిన శ్రీనివాసరావు, రాంజీ, పద్మ, సింహాద్రి, సుహాసిని, రజిత, శ్రీలత, సువర్ణ, వెంకటచారి, చరణ్ ధనంజయలకు తలకు, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. విషయం తెలియడంతో వెంటనే స్పందించిన దేవరకొండ సీఐ నర్సింహులు, ఎస్ఐ అజ్మీర రమేష్ హుటాహుటిన పోలీస్ వాహనాల్లో సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాలైన వారిని దేవరకొండ ఆసుపత్రిలో చికిత్స నిర్వహించారు. బస్సులో 48మంది ప్రయాణికులు ఉన్నారు. 11మందికి గాయాలవడంతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం వారు స్వగ్రామాలకు బయలుదేరారు. దేవరకొండ సీఐ నర్సింహులు ఆధ్వర్యంలో ప్రమాదం జరిగిన వెంటనే సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెనుప్రమాదం తప్పిందని క్షతగాత్రులు తెలిపారు. పెనుప్రమాదం తప్పడంతో ప్రయాణికులు, పోలీసులు, ఆర్టీసీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనా స్థలాన్ని దేవరకొండ ఇన్‌చార్జి డీఎం సైదులుగౌడ్ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ డ్రైవర్ మహేష్‌కు స్వల్పగాయాలయ్యాయని, ప్రమాదం ఏమిలేదని ఇన్‌చార్జి డీఎం తెలిపారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.



ప్రమాదంలో గాయపడి దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు, (ఇన్‌సెట్‌లో) బస్సు

నేటికీ అందని రేషన్ బియ్యం

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నారు. ఇప్పటి వరకు 4వేలకు పైగా మెట్రిక్ టన్నులు మాత్రమే బియ్యాన్ని సరఫరా చేశారు. ఇంకా చాలా దుకాణాలకు బియ్యం చేరలేదు. బియ్యం ఎప్పుడు వస్తాయో డీలర్ల వద్ద స్పష్టమైన సమాచారం లేదు.

● యాదాద్రి జిల్లాలో ఐదు ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. భువనగిరి, ఆలేరు, మోత్కూరు, రామన్నపేట, చౌటుప్పల్‌లో ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. ప్రతీ నెల చివరి వారంలో ఎంఎల్ఎస్ పాయింట్లకు కేటాయించిన కోటాను నెల 1, 2 తేదీల్లోగా రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తారు. ఆ తర్వాత డీలర్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. ప్రతీ నెల జిల్లాకు 3,200 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీచేస్తుండగా, ఈ నెల కోటా పూర్తిగా పంపిణీ చేశారు. వీటిని లబ్ధిదారులకు కూడా పంపిణీచేయడం పూర్తయింది.

ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద స్టాక్ లేకపోవడంతో

లబ్ధిదారులకు రేషన్ దుకాణాల ద్వారా అందించే బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద స్టాక్ లేదు. దీంతో రేషన్ దుకాణాలకు కోటా ప్రకారం బియ్యం సరఫరా చేయలేకపోయారు. సాధారణంగా ప్రతి నెలా రేషన్ దుకాణాలకు 5వ తేదీలోగా మొదటి విడత బియ్యాన్ని సరఫరా చేస్తారు. ఈ బియ్యం పంపిణీ పూర్తయ్యాక మరోసారి రెండో విడత బియ్యం సరఫరా చేస్తారు. సంబంధిత డీలరు ప్రతి నెలా 20వ తేదీలోపు లబ్ధిదారులకు బియ్యాన్ని అందించాల్సి ఉంది. ఏదైనా సమస్య తలెత్తి ఆలస్యమైతే అదనంగా మరో నాలుగు రోజులు గడువు ఇస్తారు. కానీ ఈ నెల ఇంకా మొదటి విడత కూడా బియ్యం సరఫరా కాలేదు. మొదటి విడత సరఫరా అయిన దుకాణాలకు రెండో విడత సరఫరా కాలేదు. దీంతో ఈ నెలలో లబ్ధిదారులకు సక్రమంగా బియ్యం పంపిణీ జరిగేది అనుమానమే.

వేబ్రిడ్జిలు లేకపోవడంతో ఆలస్యం

సూర్యాపేట జిల్లాలో రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వం నాలుగు ప్రాంతాల్లో ఎంఎల్ఎస్ (మండల లెవల్ స్టాక్) పాయింట్లను ఏర్పాటు చేసింది. సూర్యాపేట, కోదాడ, తుంగతుర్తి, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. ఈ పాయింట్ల నుంచి వారి పరిధిలోని రేషన్ దుకాణాలకు ప్రతి నెలా బియ్యం సరఫరా చేస్తుంటారు. అయితే ఈసారి బియ్యం సరఫరా మాత్రం ఆలస్యమైంది. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద అధిక సామర్థ్యం ఉన్న వేబ్రిడ్జి లేకపోవడంతో బియ్యం తూకం వేయడం ఆలస్యం అవుతోంది. దీంతో బియ్యం సరఫరా ఆలస్యమైందని, ఇప్పటికైనా ప్రభుత్వం ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద వేబ్రిడ్జిలను ఏర్పాటు చేస్తే వచ్చే నెల నుంచి బియ్యం సరఫరా ఆలస్యం కాకుండా ఉండే అవకాశాలున్నాయి.

వచ్చే నెల నుంచి సన్నబియ్యం

ప్రభుత్వం వచ్చే నెల నుంచి రేషన్ దుకాణాల లబ్ధిదారులకు సన్న బియ్యం అందించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అందులో భాగంగానే ప్రస్తుతం జిల్లాలో ఈ నెల బియ్యం సరఫరా ఆలస్యమైనట్లు తెలుస్తోంది. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద దొడ్డు బియ్యం స్టాక్ లేకుండా పూర్తిగా ఖాళీ చేయిస్తున్నారు. సన్నబియ్యం అందించేందుకు దొడ్డు బియ్యం నిల్వలు ఏమాత్రం ఉండకుండా చర్యలు చేపట్టారు. దీంతో బియ్యం నిల్వలు లేకపోవడంతో ఈనెల పంపిణీ చేసేందుకు పలువురు మిల్లర్ల నుంచి ప్రభుత్వం అవసరమైన బియ్యాన్ని కొనుగోలు చేస్తోంది. కొనుగోలు చేసిన బియ్యాన్ని రేషన్‌దుకాణాలకు సరఫరా చేసి లబ్ధిదారులకు అందించేలా ఏర్పాట్లు చేశారు. దొడ్డు బియ్యం నిల్వలు లేకుండా చేసి వచ్చే నెల నుంచి సన్నబియ్యం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం సన్నబియ్యాన్ని జిల్లాలో నిల్వ చేసింది. కొన్ని నెలలకు సరిపడా ఈ నిల్వలు ఉన్నట్లు సమాచారం.

దొడ్డు బియ్యం నిల్వలు లేకపోవడంతో ఆలస్యం

జిల్లాలోని లబ్ధిదారులకు రేషన్ దుకాణాల ద్వారా ప్రతీ నెల అందించే దొడ్డు బియ్యం ప్రస్తుతానికి జిల్లాలో నిల్వలు లేవు. దీంతో లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. కొనుగోలు చేసి సరఫరా చేయడం కారణంగా ఆలస్యమవుతోంది. విడతల వారీగా బియ్యం సరఫరా చేస్తున్నాం. త్వరలో జిల్లా మొత్తం బియ్యం సరఫరా అవుతుంది. బియ్యం సరఫరా విషయంలో లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

• ప్రసాద్‌కుమార్, సివిల్ సప్లయ్ డీఎం, సూర్యాపేట

నేటిలోగా పూర్తిస్థాయిలో బియ్యం పంపిణీ

బియ్యం పంపిణీ సోమవారంలోగా పూర్తిచేస్తాం. ఇప్పటి వరకు 80 నుంచి 85శాతం బియ్యం రేషన్ దుకాణాలకు సరఫరా అయ్యాయి. రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీని ఈ నెల 23 వరకు పూర్తి చేస్తాం. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందరికీ బియ్యం పంపిణీ చేస్తాం.

• హరీష్, ఇన్‌చార్జి డీఎస్‌వో, నల్లగొండ

ప్రమోద సాహితి సమితి కార్యవర్గం ఎన్నిక

చిట్యాల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రమోద సాహితి సమితి సర్వసభ్య సమావేశం ఆదివారం చిట్యాలలో వ్యవసాజీఖిపక ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కుకుడాల గోవర్ధన్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా కందిమళ్ల కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు సిలివేరు నర్సింహ, అద్దెల లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి తాడూరి చంద్రం, కోశాధికారి కృష్ణ, కార్యదర్శులు, సభ్యులను ఎన్నుకున్నారు.

వైభవంగా శివాలయ వార్షికోత్సవం

శాలిగౌరారం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురజాల గ్రామంలోని విశాలాక్షిసమేత కాశీ విశ్వనాథేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం కన్నులపండువగా జరిగింది. పురోహితులు కొడవటికంటి సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని కిషోర్‌కుమార్,రూప దంపతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గం గుండా శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటాచారి, మల్లేష్ పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి

శ్రీనివాస్, ఎంఈవో, మర్రిగూడ



మర్రిగూడ మండలంలో పది తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల విద్యాధికారి బిట్టు శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

(మర్రిగూడ,ఆంధ్రజ్యోతి)

ఇంటర్వ్యూ Interview

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి? ఎంత మంది విద్యార్థులు పదవ తరగతి చదువుతున్నారు?

ఎంఈవో: మండలంలోకి కేజీబీవీ, ఆదర్శ పాఠశాలతో కలిపి 7 జడ్పీ హైస్కూల్‌లు ఉన్నాయి. అందులో 235 మంది విద్యార్థులు పదవ తరగతి చదువుతున్నారు.

ఆంధ్రజ్యోతి: ఉత్తీర్ణత శాతం పెంచడానికి విద్యార్థులపై ఎలాంటి శ్రద్ధ తీసుకుంటున్నారు?

ఎంఈవో: ఎదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచడం కోసం ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. చురుకైన విద్యార్థులు 10 జీపీఏ సాధించడానికి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం.

ఆంధ్రజ్యోతి: గత సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం తగ్గింది? ఈ విద్యా సంవత్సరం ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఎలాంటి విద్యాబోధనలు అందిస్తున్నారు?

ఎంఈవో: గతంలో కంటే మెరుగైన విద్యా బోధనలు అందించడమే కాక మెరుగైన విద్యను అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం.

వేధిస్తున్న విద్యుత్ లోవోల్టేజీ సమస్య

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

తిప్పర్తి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పంట చేతికి వచ్చే సమయంలో రైతులకు విద్యుత్ సమస్యలు మొదలయ్యాయి. దీంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. తిప్పర్తి మండలంలో వానాకాలంలో 26,600 ఎకరాల్లో వరిసాగు కాగా ఈ వేసవిలో 28,364 ఎకరాల్లో సాగు చేశారు. గత నెల చివరలో కూడా సంవృద్ధిగా పోసిన బోర్లు ఒక్కసారిగా తగ్గిపోయాయి. ఇదిలా ఉండగా వేసవికాలం సాగులో కొంత మేర వరిసాగు పెరగడంతో భూగర్భ జలాలు తగ్గాయి. వానాకాలంలో వర్షాధార పంటలు వేసిన రైతులు ప్రస్తుతం వరిసాగు చేస్తున్నారు. దీంతో విద్యుత్ సర్వీసులపై ప్రభావం పడిలో వోల్టేజీ సమస్య మొదలైందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. మండల పరిధిలోని మామిడాల గ్రామంలో ఉన్న సబ్‌స్టేషన్ నుంచి యల్లమ్మగూడెం, గోదోరిగూడెం, మామిడాల, యాపలగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అదే విధంగా గతేడాది ఉన్న కనెక్షన్ల కన్నా ఈ సంవత్సరంలో కొత్త విద్యుత్ కనెక్షన్లు పెరగడం కూడా లోవోల్టేజీ సమస్యకు మరో కారణం. బోరు కనెక్షన్లు పెరిగిన దానిని బట్టి ఈ సమస్య ఎక్కువవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న బోరు కనెక్షన్లకు అనుగుణంగా సబ్‌స్టేషన్‌లో వసతులు ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు. కొన్ని రోజులుగా మామిడాల సబ్‌స్టేషన్‌లో లో వోల్టేజీ విద్యుత్ రావడంతో ప్రతీ రెండు రోజులకు ఒక్క రోజు 4 నుంచి 6 గంటల మేర విద్యుత్ నిలిపివేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఈ కారణం ద్వారా మామిడాల గ్రామంలో ఇప్పటికే సుమారు వంద ఎకరాలకు పైగా పొలాలు ఎండిపోగా రెండు, మూడు రోజులకు ఒక్కసారి లోవోల్టేజీ సమస్యతో బోర్లు కాలిపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మామిడాల గ్రామంలోని విద్యుత్ ఉపకేంద్రం, మామిడాల గ్రామంలో చిన్నధార పోస్తున్న వ్యవసాయ బోరు

నిర్లక్ష్యంగా అధికారులు

రైతులు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులకు గురవుతుంటే అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తిప్పర్తి మండల విద్యుత్ శాఖ అధికారిగా ఇక్కడ విధులు నిర్వహించిన రమ్య బదిలీపై వెళ్లారు. దీంతో 3 నెలలుగా ఆ పోస్టు ఖాళీగానే ఉంది. దీంతో పక్క మండలమైన కనగల్ ఏఈ తిప్పర్తి మండల ఇన్‌చార్జిగా ఉన్నారు.

లో వోల్టేజీ సమస్యతో ఇబ్బందులు



నేను మా సొంత పొలం 2 ఎకరాలతో పాటు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాను. నీటి సమస్య ఉంటుందనే ముందుగానే వరిసాగు చేశాను. 3 ఎకరాల్లో పంట చేతికివచ్చే సమయమైంది. కానీ మరో 4 ఎకరాలు నెల రోజులు పడుతుంది. కానీ ఇప్పుడే లోవోల్టేజీ సమస్య ఏర్పడింది. ఎక్కువ సార్లు మోటార్లు మరమ్మతులు రావడంతో పొలం ఎండిపోయే ప్రమాదం ఉంది. పెట్టిన పెట్టుబడి నష్టపోతామేమోనని భయంగా ఉంది.

- అనుములపురి మనోజ్, రైతు, మామిడాల

లో వోల్టేజీ సమస్య మా దృష్టికి రాలేదు

లోవోల్టేజీ సమస్య ఉందని మా దృష్టికి రాలేదు. రైతులు ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరిస్తాం.

- కుమార్, ఇన్‌చార్జి ఏఈ

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు శూన్యం

మామిడాల గ్రామ సబ్‌స్టేషన్ నుంచి ఐదు గ్రామపంచాయతీల పరిధిలోని వ్యవసాయ భూములు, గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ క్రమంలో ఏదేని ప్రకృతి వైపరీత్యం వర్షం, గాలిదుమారం వంటివి వచ్చినప్పుడు విద్యుత్ వైర్లు తెగడం, ట్రిప్ అవడం జరిగితే వాటిని పునరుద్ధరించడానికి అధికారులు అందుబాటులో ఉండటం లేదు. ప్రస్తుతం కాల్వల నుంచి సాగునీరు సరఫరా కాకపోవడంతో ఒక్క రోజులో 4 గంటలు బోరు తగ్గినా పంట ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని అన్నదాతలు కోరుతున్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం

- బ్రహ్మోత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరురూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చండూరు మండలం తుమ్మలపల్లి పార్వతీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం విమాన రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం వేద మంత్రాల నడుమ భక్తులతో కలిసి స్వామివారి రథాన్ని లాగి విమాన రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్వతీ రామలింగేశ్వరస్వామి దయవల్ల ఈ ప్రాంతం అంతా పచ్చని పంటలు, పిల్లాపాపలతో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మహోన్నతమైన దేవాలయ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, ఆలయ కమిటీ చైర్మన్ గునరెడ్డి రమ్య రామలింగారెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాస్, ఆలయ మాజీ చైర్మన్ గజ్జల కృష్ణారెడ్డి, నాయకులు కోడి గిరిబాబు, దోటి వెంకటేష్‌యాదవ్, పల్లె వెంకన్న, నల్లగంటి మల్లేష్, ఈవో నాగిరెడ్డి, దేవాలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ



ప్రమాదంగా ఉన్న డ్రైనేజీ

మర్రిగూడ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండల కేంద్రంలో రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీ ప్రమాదకరంగా మారింది. మరమ్మతులు నోచుకోక ప్రమాదరంగా మారడంతో బాటసారులు, వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. మర్రిగూడ మండల కేంద్రంలో రాఘవేంద్ర ఫర్నీచర్ షాపు వద్ద ఇరుకైన రోడ్డు ఉండటం వల్ల దానికి తోడు డ్రైనేజీ ఉండటం వల్ల అక్కడ నుంచి వెళ్లాలంటే ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలను పెట్టుకొని వెళ్తున్నారు. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోన నే భయంతో వెళ్తున్నారు. ఎదురెదురు వాహనాలు వస్తే పక్కకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డు పక్కనే ఉన్నటు వంటి డ్రైనేజీ మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.

గోపాల్‌రెడ్డికి విద్యావైభవ సరస్వతి అవార్డు

నార్కట్‌పల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంలకు చెందిన కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి సర్ సీవీ రామన్ అకాడమీ విద్యా వైభవ సరస్వతి అవార్డును అందజేసింది. లోటస్ ల్యాప్ విద్యాసంస్థలను నెలకొల్పి విద్యార్థులకు ఉత్తమమైన బోధన అందించడంతో పాటు సామాజిక కార్యకర్తగా పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న సేవలకు గుర్తింపుగా గోపాల్‌రెడ్డిని ఈ పురస్కారానికి అకాడమి ఎంపిక చేసింది. హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అతిథులు వైవీశాస్త్రి, చాముండేశ్వరి, ఏఎస్పీ వగడాల అశోక్, సినీనటుడు శంకర్‌రావు అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

మర్రిగూడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ద్వారా మంజూరైనటువంటి నిధులతో మండలంలోని లెంకలపల్లి గ్రామంలో ఆదివారం మాజీ ఎంపీటీసీ ఐతగోని వెంకన్నగౌడ్ సీసీ రోడ్డును ప్రారంభించారు. నేరళ్లపల్లి రోడ్డులో తిరుమలి వెంకటయ్య ఇంటి వద్దకు సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి రాజగోపాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేదరి శంకర్, మహేష్, రవి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మేత కోసం మైళ్ల దూరం



మాదారం గ్రామ జాతీయ రహదారి నుంచి వెళ్తున్న గోవులు

శాలిగౌరా రం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి క ల్పించే ఆవుల కు మేత దొ రకక... వాటి ఆక లి కోసం మైళ్ల దూరం వెళ్తూ జీవనం కొనసాగిస్తున్నారు. దేవరకొండ ప్రాంతానికి చెందిన కొంతమంది ఆవుల యజమానులు దాదాపు 500 ఆవు లు, లేగ దూడలను తోలుకుంటూ మేత కోసం రోజుల తరబడి ఇళ్లు, ఊరు విడిచి నడుచుకుంటూ వెళ్తున్నారు. శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామానికి మేత కోసం ఆవులను వారం రోజుల క్రితం తోలుకొచ్చారు. తిరుగు ప్ర యాణంలో మండలంలోని మాదారం జాతీయ రహదారిపై ఆవుల మంద కనిపించింది. తాము ఇంటి నుంచి బయలు దేరి నాలుగు నెలలైందని అన్నారు. ఎండనక, వాననక, చలినక వారు జీవన ప్రయాణం కొనసాగిస్తున్నారు.

రామాలయంలో సత్రాల నిర్మాణానికి శంకుస్థాపన

శాలిగౌరారం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం రూ. 10లక్షల వ్యయంతో నిర్మించే సత్రాలకు వేద మంత్రాలతో ఆర్ఎస్ఎస్ తెలంగాణ రాష్ట్ర సంఘటన్ అధ్యక్షుడు చాడ రమేష్ చందర్‌రెడ్డి, ఝాన్సీ దంపతులు శంకుస్థాపన చేశారు. తన తల్లిదండ్రులు చాడ వెంకట్రామరెడ్డి, భారతమ్మల జ్ఞాపకార్థం సత్రాలు నిర్మిస్తున్నట్లు రమేష్‌చందర్ రెడ్డి తెలిపారు. మూడు నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శేషం రత్నమాచార్యులు, నరసింహచార్యులు, జగన్మోహన చార్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి మాటలు జుగుప్సాకరం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాలరూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు జుగుప్సాకరంగా ఉన్నాయని, మైకుల ముందు మాట్లాడినంత సులువుగా పరిపాలన చేయడం కాదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడులో ఎండిన వరి పొలాలను ఆదివారం చిరుమర్తి లింగయ్య పరిశీలించారు. స్థానిక రైతు పరిచేనుకు ట్యాంకరు ద్వారా నాటినందిస్తుంగా ఆయన పైపును పట్టుకుని పొలానికి నీటిని పట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరందక పచ్చని పంటపొలాలు కళ్లెదుటే ఎండిపోతున్నా, రైతులు తల్లడిల్లుతున్నా ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తూ మొద్దునిద్ర పోతుందని విమర్శించారు. సాగునీరందకపోవడంతో పలువురు రైతులు ట్యాంకరు ద్వారా పొలానికి నీరందిస్తున్నారని ఆ రైతును చూస్తుంటే గుండె తరుక్కుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో పాడిపంటలతో సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీడుభూములుగా మారాయని పేర్కొన్నారు. ఎండిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందించి రైతులను ఆదుకుని చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డికి అకారణంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని, అది హేయమైన చర్య అన్నారు. జగదీష్‌రెడ్డి గొంతు నొక్కి ఏదో సాధిస్తామంటే అది సర్కార్ పిచ్చి ఆలోచన మాత్రమేనన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి తాము కేసీఆర్ సైనికులుగా పోరాడతామని అన్నారు.

డంపింగ్ యార్డును ఎత్తివేయాలి

- పొగతో ఇబ్బందులు పడుతున్నామని శివనేనిగూడెం గ్రామస్థుల ఆందోళన



చెత్త తరలించే వాహనాన్ని అడ్డుకుంటున్న శివనేనిగూడెం గ్రామస్థులు

చిట్యాల, మార్చి16 (ఆంధ్రజ్యోతి): డంపింగ్‌యార్డును ఎత్తివేయాలని శివనేనిగూడెం గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామంలోని అఖిలపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో గ్రామస్థులు డంపింగ్‌యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డంపింగ్‌యార్డులో చెలరేగిన మంటలు వాటి ద్వారా వస్తున్న పొగతో చిట్యాల మునిసిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డు అయిన శివనేనిగూడెం గ్రామం ఉక్కిరిబిక్కిరి అవుతుందని గ్రామస్థులు ఆరోపించారు. ముఖ్యంగా వృద్ధులు శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని, వారి ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఊరు విడిచివెళ్లే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. డంపింగ్ యార్డు పక్క నుంచే గ్యాస్ పైప్‌లైన్ ఉందని, ఈ మంటలు గ్యాస్‌పైప్‌లైన్‌కు వ్యాపించే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. చిట్యాల, శివనేనిగూడెం గ్రామాల మధ్య దూరం కిలోమీటరేననీ ఇక్కడ డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడం వల్ల అటు చిట్యాల ఇటు శివనేనిగూడెం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. డంపింగ్‌యార్డు వెంటనే తొలగించాలని లేనిచో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా చెత్త తరలింపు వాహనాన్ని అడ్డుకుని ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నూతి సైదులు ముదిరాజ్, రుద్రవరం సహదేవులు, బీజేపీ నాయకులు రుద్రవరం లింగస్వామి, గుండాల నరేష్‌గౌడ్, సీపీఎం నాయకులు పాలమాకుల అర్జున్, బీఆర్ఎస్ నాయకులు రుద్రవరం వంశీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో నిరుపేదలకు లబ్ధి

- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



చెక్కులు అందజేసిన శాసనమండలి చైర్మన్ గుత్తా

నల్లగొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం వల్ల నిరుపేదలకు ఎంతగానో లబ్ధి చేకూరుతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో 34 మంది నిరుపేదలకు రూ.9లక్షల45 వేల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం వల్ల లక్షలాది మంది నిరుపేదలకు సహాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమాజ సేవయే పరమావధిగా పనిచేయాలి

నల్లగొండ క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమాజసేవయే పరమావధిగా పనిచేయాలని దక్షిణ మధ్య క్షేత్ర, సేవ ప్రముఖ్ ఎక్క చంద్రశేఖర్ అన్నారు. సోమేపల్లి సోమయ్య స్మారక సేవ అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో సమాజంలో ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, ఆహార దానం, బాలల సంరక్షణ, సేంద్రీయ వ్యవసాయం, రక్తదానం, సంక్షేమం లాంటి సామాజిక సేవా తత్పరులకు స్థానిక లయన్స్ భవన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ సోమేపల్లి సోమయ్య తన జీవితం మొత్తాన్ని సమాజ సేవల కోసం అంకితం చేశారని, ఆయన సమయపాలనతో పాటు క్రమశిక్షణ సైతం ఆచరిస్తూ వారి జీవితమే పాఠంగా ప్రతి ఒక్కరినీ మార్గదర్శనం చేసిన వ్యక్తి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 25 స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారికి సన్మానించారు. కార్యక్రమంలో పల్‌రెడ్డి రాంరెడ్డి, సంస్థ కార్యదర్శి నాగశేఖర్, క్షేత్ర ప్రచార ప్రముఖ గొట్టిముక్కల భాస్కర్, కోశాధికారి హనుమంతరావు, విభాగ సంచాలకులు గార్లపాటి వెంకటయ్య, ఇటికాల కృష్ణయ్య, నన్నూరి రాంరెడ్డి, బీమనపల్లి శ్రీకాంత్, పొట్టిపాక నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శాలిగౌరారంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

నల్లగొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1990-94 సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వంగాల అనిల్‌రెడ్డితో పాటు బండారు సుధాకర్‌రెడ్డి, ఎస్‌కె. జా హంగీర్, పున్న అరుణ, వందనపు సుమతి, కాసర్ల రమాదేవి, బేబి కంబమ్మ, ఊర్మిళ, శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, యాదగిరిరెడ్డి, జయరాం పాల్గొన్నారు.

● శాలిగౌరారం: శాలిగౌరారం విజ్ఞాన జ్యోతి హైస్కూల్‌లో చదువుకున్న 2006-2007 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం శాలిగౌరారంలోని జీబీఎం ఫంక్షన్ హాల్‌లో పూర్వ వి ద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 18 సంవత్సరాల తర్వాత అందరూ కలుసుకోవడం వారి మధుర జ్ఞాపకాలు స్మ రించుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వారి కి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం, కరస్పాండెంట్ బుడిగె శ్రీనివాస్, ఉపాధ్యాయులు కొయ్యడ శివశంకర్, ప డాల అంతయ్య, కొడవకంటి సుబ్రహ్మణ్యశర్మ, రావుల వీరయ్య, బెల్లంకొండ స్వామి, చెవుగోని సత్యనారాయణ, మద్ది శశిధర్ రెడ్డి, ఖాజా, అరుణ, రజిత, లక్ష్మి, రేఖ, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌ను సన్మానించిన మంత్రి



ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను అభినందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన కేతావత్ శంకర్ నాయక్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, పట్టణశాఖ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగదీష్‌రెడ్డి శాసనసభ సభ్యత్వం రద్దు చేయాలి'



కేసీఆర్, కేటీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నల్లగొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో ఆదివారం మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జగదీష్‌రెడ్డి వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఖండించకుండా మద్దతు పలకడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో నాయకులు గాలి నాగరాజు, అల్లి సుభాష్‌యాదవ్, బొజ్జ శంకర్, శ్రీనివాస్, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, కార్తీక్, చిట్టి, గోపాల్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మంత్రి కోమటిరెడ్డి

- ఆపదలో ఉన్న ఇద్దరికి ఆర్థికంగా చేయూత



రవికి ఆర్థికసాయం అందజేస్తున్న మునిసిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి మరోసారి మానవత్వం చాటుకున్నారు. నల్లగొండలో ఆదివారం పర్యటించిన మంత్రి ఆపదలో ఉన్న ఇద్దరికి చేయూతనందించి అండగా ఉంటానని హామీ ఇచ్చా రు. డ్రిల్లింగ్ మిషన్ పడి చనిపోయిన పట్టణంలోని పెద్దబండకు చెందిన కొత్త అశోక్ కుటుంబానికి రూ. 1లక్ష, అనారోగ్యానికి గురైన నల్లగొండ పట్టణ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు, జర్నలిస్టు ఐతరాజు రవికి రూ.50వేలు అందజేశారు. ఇరువురికి పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మునిసిపల్ మా జీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అల్లి సుభాష్‌యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ పట్టణ నాయకులు, సభ్యులు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నిషేధం ఎత్తివేయకపోతే ఓయూని ముట్టడిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

నల్లగొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో ఎలాంటి ఆందోళన చేయవద్దని ఆదేశాలు జారీ చేయడం అంటే తెలంగాణ ఉద్యమాన్ని అవమానించడమేనని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున అన్నారు. ఓయూలో నిషేధ ఆజ్ఞలు ఎత్తివేయకపోతే ఓయూని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమానికి గుండెకాయ అయిన ఉస్మానియాలో నిషేధ ఆజ్ఞలు విధిస్తే ప్రొఫెసర్ కోదండరాంతో పాటు మేధావుల గొంతులకు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. 2014 తర్వాత కేసీఆర్ తెలంగాణను నెంబన్ వన్ చేస్తే రేవంత్‌రెడ్డి దశాబ్ద కాలం పాటు వెనక్కు తీసుకెళ్లారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శలు మానుకొని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు నోముల క్రాంతి కుమార్, లింగస్వామిగౌడ్, గంట కిరణ్, గణేష్, శంకర్, రాజు, వెంకన్న, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన గురువు పత్రీజీ ఆశయాలను సాధించాలి

నల్లగొండ క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ధ్యాన గురువు పత్రీజీ ఆశయాలను సాధించాలని పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్టీ దామోదర మహాస్వామి, పత్రీజీ ఫిలిమ్స్ డైరెక్టర్ ధ్యాన విద్యార్థి వెంకట్ అన్నారు. స్పిరిచ్యువల్ సొసైటీస్ ఆధ్వర్యంలో శ్రీ గణేశ పిరమిడ్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా మెగా శాకాహార ర్యాలీ నిర్వహించారు. ధ్యాన సభ నిర్వాహకులు మునాసు శివనాగరాజు, పాంపాటి శ్రీనివాస్, గాలి శ్రీనివాసులు, బచ్చు చంద్రశేఖర్, ధనలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని తహసీల్దార్ శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అల్లాని వాసు, డాక్టర్ అంజయ్య, జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, అనంతుల సత్యనారాయణ, సతీష్‌బాబు, డాక్టర్ శివకుమార్, గౌతమిరెడ్డి, లత, లక్ష్మి పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ :18004251442

యాదాద్రి :1800 425 7106

సూర్యాపేట :1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.95	140	170
నల్లగొండ	రూ.100	145	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0 । కనిష్ఠం 21.4



40 శాతం పీడీఎస్ బియ్యం పక్కదారి

ఈ ఉగాది నుంచే పేదలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో బియ్యం పక్కదారి పట్టకుండా కట్టుదిట్ట చర్యలు చేపట్టాలనే సూచనలు వస్తున్నాయి. ప్రధానంగా రేషన్ బియ్యం ఆధారంగా చేసుకొని బ్లాక్ మార్కెట్ నిర్వహిస్తున్న అక్రమార్కులకు పూర్తిగా చెక్‌పెట్టేలా పదునైన చట్టాన్ని రూపొందించడంతో పాటు, ఇచ్చిన బియ్యం వేరే మార్గంలో వెళ్తే గుర్తుపట్టేలా (బ్లూకిరోసిన్ తరహా) చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

- సన్న బియ్యం పంపిణీకి కట్టుదిట్ట చర్యలు తీసుకుంటేనే ఉపయోగం..
- నిరుపేదలకు మాత్రమే రేషన్ బియ్యంతో ఆసరా
- గిరిజన తండాల్లో సొంత అవసరాలకే
- కూలీలు, సన్నకారు రైతులు సైతం
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో ఆసక్తికర అంశాలు
- నాలుగు భిన్నమైన గ్రామాల్లో సర్వే

ప్రస్తుతం ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న పీడీఎస్ బియ్యంలో సుమారు 40శాతంమేర బ్లాక్‌మార్కెట్‌కు తరలుతోంది. తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వందల కోట్ల రూపాయల విలువైన ఈఅక్రమదందాకు రేషన్ బియ్యం నెలవుగా మారిందనే ఆరోపణలున్నాయి. పేదవర్గాలకు చెందినవారు సైతంనేరుగా ఈ బియ్యాన్ని ఆహారంగా వినియోగించకపోవడాన్ని ఆసరా చేసుకొని అక్రమార్కులు ఊరూరా మాటు వేసి సేకరించడమే వృత్తిగా పెట్టుకున్నారు. ఈ బియ్యాన్ని అక్రమమార్గంలో సేకరిస్తున్న దళారులు మద్యం కంపెనీలకు, పొరుగు దేశాలకు, తిరిగి సీఎంఆర్ ద్వారా ప్రభుత్వానికి అందిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. రేషన్ బియ్యం వక్రమార్గం పట్టకుండా ప్రభుత్వయంత్రాంగం పలు చర్యలు చేపడుతున్నా, అవన్నీ కంటితుడుపుగానే ఉంటున్నాయే తప్పపక్కదారి పట్టకుండా నిలువరించలేకపోతున్నారు. ప్రజాప్రతినిధులు, పోలీసులు, అధికారులు సైతం ఈ బియ్యం నియంత్రణలో చిత్తశుద్ధితో వ్యవహరించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో రేషన్ బియ్యంలో ఎంత మేర పక్కదారి పడుతుందనే అంశంపై 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయి పరిశీలన చేయగా, పలు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి.

పక్కదారిపడుతున్న బియ్యం

వ్యవసాయాధారిత ప్రాంతమైన జిల్లా కావడంతో పాటు, రేషన్ కార్డులు ఇచ్చిన సమయంకంటే ప్రస్తుతం వరిసాగు పెరిగింది. బీపీఎల్ పరిధి దాటినా పెద్ద సంఖ్యలో కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉండడం, తదితర కారణాలతో జిల్లాలో పీడీఎస్ బియ్యం వినియోగం 60శాతానికి మించడం లేదని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేసిన పరిశీలనలోనూ ఈ విషయం బలపడింది. ఉమ్మడి జిల్లాలో భిన్నమైన ప్రాంతాల్లో, భిన్నమైన నమూనాలు సేకరించి సర్వే నిర్వహించగా, సగటున ఉమ్మడి జిల్లాలో 40శాతం వరకు రేషన్‌బియ్యం తిరిగి దళారులకు, వ్యాపారుల వద్దకు చేరుతున్నట్టు స్పష్టమైంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 10.08లక్షల రేషన్‌కార్డులకు ప్రతినెలా 18 వేల మెట్రిక్‌టన్నులకు పైగా రేషన్‌బియ్యం పంపిణీ అవుతోంది.

పట్టణాలు, గ్రామాల నుంచే పక్కదారి..

గ్రామాలు, పట్టణాల్లో అనర్హులైనవారు, కార్డులు పొందినప్పుడు బీపీఎల్ స్థితిలో ఉండి, ఇప్పుడు ఆ స్థాయి దాటి సన్నబియ్యం తింటున్నవారు ఉన్నారు. వారికొస్తున్న బియ్యాన్ని నేరుగా దళారీలకు అప్పగిస్తున్నారు. ఈ తరహా పట్టణాల్లో, పెద్ద గ్రామాల్లో ఎక్కువగా ఉన్నారు. పట్టణాలు, గ్రామాల్లో బియ్యాన్ని నేరుగా ఆహారంగా వాడే వినియోగదారులు 20శాతం వరకు ఉంటే, రొట్టెలకు, పశువుల దాణాకు వినియోగిస్తున్నవారు 30శాతం వరకు ఉన్నారు. మరో 10శాతం మంది వారి వద్ద పనిచేసే కార్మికులకు, ఇంటిపనివారికి, కూలీలకు ఉచితంగా గానీ, లేదా నామమాత్రపు ధరకు గానీ అందిస్తున్నారు. మరో 40శాతం వరకు బియ్యం మాత్రం పక్కాగా పక్కదారి పడుతోంది.

నిరుపేదలకు ఆసరా అవుతున్న రేషన్ బియ్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్‌బియ్యం వినియోగంపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలన చేసింది. రేషన్ బియ్యం పొందుతున్న 400 అతిపేద కుటుంబాలను (వ్యవసాయకూలీలు, వృత్తిపనులు చేసేవారు, పట్టణాల్లో అడ్డాకూలీలు, కార్మికులు, గుమాస్తాలు) పలకరించింది. వీరిలో ఎస్సీఎస్టీ, బీసీ,మైనార్టీ వర్గాలకు చెందినవారు 90 శాతం వరకు ఉన్నారు. వీరిలో 74 శాతం మంది వారికొచ్చే బియ్యాన్ని నేరుగా వండి తింటుండగా, మిగిలిన 26శాతం కుటుంబాల వారు ఆ బియ్యాన్ని పిండిగా మార్చుకొని దోశ, జొన్నపిండితో కలిపి రొట్టెలుగా వినియోగిస్తున్నారు.

గిరిజన తండాల్లో రొట్టెలుగా..

గిరిజన తండాలకు చెందిన 200 కుటుంబాలను పలకరించగా, వారిలో 146 కుటుంబాల...

- మిగతా 7వ పేజీలో...

ఆంధ్రజ్యోతి పరిశీలన



నేటికీ అందని రేషన్ బియ్యం

- సరఫరాలో ఆలస్యమే కారణం
- ఎంఎల్‌ఎస్ పాయింట్లలో స్టాక్ లేకపోవడంతో ఆలస్యం
- వచ్చే నెల నుంచి సన్నబియ్యం ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం
- మిల్లర్ల నుంచి సేకరించి సరఫరా చేస్తున్న వైనం

పేదలకు ప్రభుత్వం రేషన్‌దుకాణాల ద్వారా బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. ప్రతి నెలా 1నుంచి 25వ తేదీలోపు రేషన్ డీలర్లు బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయాలి. అయితే ఈ నెల మాత్రం తొలివిడత రేషన్ బియ్యం డీలర్లకే పూర్తిస్థాయి అందలేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఇంకా చాలా మంది లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందలేదు. బియ్యం కొరతకు అధికారుల నిర్లక్ష్యమే కారణమనే విమర్శలు వస్తున్నాయి. గోదాంలో నిల్వ ఉన్న బియ్యాన్ని సరిహద్దు జిల్లా అయిన ఖమ్మం జిల్లాకు తరలించారని, దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు పంపిణీ చేసే బియ్యంలో కొరత ఏర్పడిందని సమాచారం.

- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట కలెక్టరేట్, భువనగిరి కలెక్టరేట్)

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 610 రేషన్‌దుకాణాలు, 3,05,564 రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల్లో సుమారు 8.79లక్షల మంది లబ్ధిదారులు ఉండగా, ప్రతి నెలా సుమారు 4,750 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీచేస్తున్నారు. అయితే ఈ నెలలో మాత్రం జిల్లాలో తొలి విడత డీలర్లు రావాల్సిన బియ్యం సరఫరా కాలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతానికి 3వేల మెట్రిక్ టన్నులకు పైగా రేషన్ దుకాణాలకు విడతలవారీగా బియ్యం సరఫరా చేశారు. ఇంకా మిగిలిన బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంది.

నల్లగొండ జిల్లాలో మొత్తం 997 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటికి ఎనిమిది గోదాముల నుంచి బియ్యం సరఫరా చేస్తారు. మిర్యాలగూడ, నల్లగొండ, పెద్దవూర, దేవరకొండ, నకిరేకల్, నిడమనూరు, చండూరు, నాంపల్లి మండలాల్లో ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రతీ నెల 6,750 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ ...

- మిగతా 7వ పేజీలో...

ప్రశ్నపత్రాల ప్యాకింగ్ నిర్లక్ష్యంపై

ఇంటర్‌బోర్డ్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- సంబంధిత కేంద్రం సీఎస్, డీవో నుంచి వివరణ తీసుకోవాలని ఆదేశం
- పొరపాటున బండిల్స్ వచ్చాయంటున్న అధికారులు

నల్లగొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఇంటర్ ప్రశ్నపత్రాల ప్యాకింగ్‌లో నిర్లక్ష్యంపై ఇంటర్‌బోర్డు అధికారులు స్పందించారు. ఆరో రోజు పరీక్షా పత్రాల కవర్‌లో ఏడోరోజుకు సంబంధించిన ఒకేషనల్ ప్రశ్నపత్రాలుండగా, వాటిని గ్రహించి తిరిగి పోలీస్ కస్టడీకి పంపిన విషయాన్ని నిర్ధారించారు. ఈ విషయంపై పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి నుంచి ఆదివారమే జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి వివరణ తీసుకోవాలని ఇంటర్‌బోర్డు కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. 'ఇంటర్ ప్రశ్నపత్రాల ప్యాకింగ్‌లో నిర్లక్ష్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఆదివారం కథనం ప్రచురించగా, దీనిపై తీవ్రస్థాయిలో చర్చసాగింది. చివరికి అధికారులు స్పందించారు. ఈ విషయమై నల్లగొండ ఇంటర్ విద్యాశాఖాధికారి దస్రునాయక్‌ను వివరణ కోరగా, ప్రశ్నపత్రాలు లీక్‌కాలేదని, ఆరో రోజు బండిల్స్‌తో పాటు, ఏడో రోజు బండిల్స్ వచ్చాయని తెలిపారు. ఇది ఆ కేంద్రం నిర్వాహకుల వైఫల్యమేనని, వారి నుంచి వివరణ కూడా తీసుకొని ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు. ఆ రోజే ఆ బండిల్స్‌ను వెంటనే పోలీస్ కస్టడీకి పంపామని తెలిపారు. విషయాన్ని అదే రోజు జిల్లా అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ గ్రహించినా బయటికి పొక్కకుండా జాగ్రత్తపడ్డారని, అందువల్లే పేపర్ లీకవడం వంటి దురదృష్టకర ఘటన జరగలేదని పలువురు అభిప్రాయపడ్డారు. జిల్లాలో ప్రశ్నపత్రాల పంపిణీ విధానం కూడా సక్రమంగా లేదని పలువురు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తెచ్చారు. ప్రత్యేక వాహనాల్లో వీటిని పరీక్షా కేంద్రాలకు తరలించాల్సి ఉండగా, ఉమ్మడి జిల్లాలో ఈ విధానం సక్రమంగా పాటించడం లేదని చెప్పారు. ఆటోల్లో, బైక్‌లపై ప్రశ్నపత్రాలు తీసుకువస్తున్నారని, దీనిపై కలెక్టర్లు సహా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (సోమవారం సాయంత్రం) సహర్: 5:00 (మంగళవారం ఉదయం)

వేసవిలో ఇబ్బందులు లేకుండా చూడాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో జిల్లాలో సాగు, తాగునీరు, విద్యుత్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లాలో సాగునీటి సౌకర్యంతోపాటు సుమారు లక్ష ఎకరాల ఆయకట్టు పెరిగిందని, ఫలితంగా విద్యుత్‌కు డిమాండ్ సైతం పెరిగిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సాగు, తాగునీరు, విద్యుత్ ఇబ్బందులు ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది వరి దిగుబడి భారీగా వచ్చే అవకాశం ఉన్నందున ఐకేపీ కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, టార్పాలీన్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వ్యవసాయశాఖకు 80 క్లస్టర్లు, ఏఈఓ పోస్టులు మంజూరు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మంత్రి దృష్టికి తీసుకురాగా, వ్యవసాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడి క్లస్టర్లను మంజూరు చేయాలని కోరడంతో అందుకు ఆయన సమ్మతించారు. నెలలోపు క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటించారు. నల్లగొండ పట్టణంతో పాటు, గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ కోతలు ఉండవద్దన్నారు. వచ్చే నెల 1 లేదా 2న రూ.36కోట్లతో నిర్మించనున్న కలెక్టర్ కార్యాలయ అదనపు భవనాల నిర్మాణాలకు, 15 విద్యుత్ సబ్‌స్టేషన్లు, మాడుగులపల్లి పోలీస్‌స్టేషన్ భవనం, ఇతర కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్టు తెలిపారు. జిల్లా కేంద్రంలో కొత్త పోలీస్ క్వార్టర్ల నిర్మాణానికి అనుమతి రానున్నదని, డీఎస్పీ కార్యాలయం మంజూరైనందున శంకుస్థాపన చేస్తామన్నారు. రూ.520కోట్లతో మంజూరైన బైపాస్ రోడ్డుకు టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎమ్మార్పీ, ఎస్ఎల్‌బీసీ హైలెవెల్ కెనాల్ ద్వారా అందిస్తున్న సాగునీరు, పంటల పరిస్థితి, తాగునీరు, విద్యుత్, తదితర అంశాలను మంత్రికి వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి శ్రవణ్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మంత్రి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో 'ప్రజావాణి' నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆయకట్టు చివరి వరకూ నీరు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, తిప్పర్తి): ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మామిడాల గ్రామ చెరువును ఆయన పరిశీలించారు. సాగునీటి సమస్యకు కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. డీ-40 కాల్వ కింద ఉన్న 11-ఎల్ మైనర్ కాల్వ ద్వారా చెరువుకు చేరాల్సిన నీరు పూర్తిస్థాయిలో రావడంలేదని, దీనికి కొందరు కాల్వను పూడ్చడమే కారణమని రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి స్పందించి వెంటనే సాగునీరు చెరువులోకి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఆదేశించారు. గ్రామానికి చెందిన నిరుపేద మహిళ ముత్తం రాజేశ్వరి చెరువు పక్కనే పూరిగుడిసెలో నివాసం ఉంటుండగా, ఆమెకు వచ్చే దఫాలో ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని ఎంపీడీవో ఎ.వెంకటేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. తాత్కాలికంగా రేకులతో ఇంటి నిర్మాణం చేసుకునేందుకు రూ.50వేల ఆర్థిక సాయం చేయాలని సూచించారు. మంత్రి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నాగులవంచ లింగారావు, పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, బొల్లెద్దు నాగారాణి అంబేడ్కర్, ఈదయ్య, ఉన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

(ఆంధ్రజ్యోతి, కనగల్): రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం కనగల్ మైలసముద్రం చెరువుతో పాటు ఏఎమ్మార్పీ డిస్ట్రిబ్యూటరీ-25 పరిధిలోని 6-ఎల్ మైనర్ కాల్వను ఆయన పరిశీలించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఏఎమ్మార్పీ కింద 2.20లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, ప్రస్తుతం 2.15లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతోందన్నారు. ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిధిలోని ఏఎమ్మార్పీ మైనర్ కాల్వలను రైతుల కోరిక మేరకు రూ.90లక్షలు సొంత నిధులతో పనులను చేపట్టి పూర్తిచేయించానన్నారు. రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్‌పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ, డిస్ట్రిబ్యూటరీల ఆధునీకరణ, లైనింగ్ పనులకు రూ.1,000కోట్లతో త్వరలో ప్రభుత్వం టెండర్లు పిలవనుందని తెలిపారు. పొనుగోడు, నర్సింగ్‌భట్ల, కంచనపల్లి,బక్కసాయికుంట ఎత్తిపోతల పథకాలకు ఈనెల 28న శంకుస్థాపన చేస్తానన్నారు. కార్యక్రమంలో అధికారులతోపాటు మాజీ జడ్పీటీసీలు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మందడి రాంచంద్రారెడ్డి, గడ్డం అనూప్‌రెడ్డి, భిక్షంయాదవ్, గోలి జగాల్‌రెడ్డి, నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, మురళిగౌడ్, భారతివెంకన్న, వెంకట్‌రెడ్డి, రాజురెడ్డి, దిలీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో అభివృద్ధే ధ్యేయం



కృతజ్ఞతా సభలో డప్పు కొడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వేదికపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు

తుంగతుర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసినందుకు ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఆదివారం తుంగతుర్తిలో ఎమ్మెల్యే మందుల సామేలు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, అదేవిధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో త్వరలో చట్టం తేనుందన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్ ఉందని, 2026 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే సామేలు మాట్లాడారు.

కేఎన్‌ఎం డిగ్రీ కళాశాల సెమినార్‌కు సిద్ధం

- అర్థశాస్త్ర విభాగంలో జాతీయ సదస్సు
- హాజరుకానున్న విద్యావేత్తలు




సెమినార్‌కు సిద్ధమైన వేదిక

మిర్యాలగూడ టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి సెమినార్ సోమవారం ప్రారంభం కానుంది. ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సెంటర్ ఆధ్వర్యంలో అర్థశాస్త్ర విభాగంలో రెండు రోజుల పాటు ఈ సెమినార్ జరగనుంది. గ్రోత్ పొటెన్షియాలిటీస్ ఇన్ తెలంగాణ స్టేట్ ప్రాస్పెక్ట్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై నిర్వహించనున్న ఈ సెమినార్‌లో రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటునందించే పలు పరిశోధనాత్మక అంశాలతో కూడిన ప్రజెంటేషన్లు ఇవ్వనున్నారు.

హాజరు కానున్న ప్రముఖులు

అర్థశాస్త్ర విభాగం పంపిన ప్రాజెక్టును మెచ్చిన ఐసీఎస్ఎస్ఆర్‌సీ జాతీయస్థాయి సదస్సు నిర్వహించేందుకు కేఎన్‌ఎం ప్రభుత్వ కళాశాలను ఎంపిక చేసింది. ఈ సెమినార్‌కు దేశ నలుమూలల నుంచి విశ్వవిద్యాలయాల వీసీలు, ప్రొఫెసర్లు, కేంద్రీయ విద్యాలయాల అధిపతులు హాజరు కానున్నట్లు ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, సెమినార్ కన్వీనర్ నరేష్ గుమ్మడి తెలిపారు.

చరిత్రలో నిలిచిపోతుంది



పట్టణంలో జాతీయ స్థాయి సెమినార్ జరగడం చరిత్రలో నిలిచిపోయే విషయం. అర్థశాస్త్ర మంటే ఆర్థిక ప్రగతికి మూలం. అటువంటి అంశంపై సదస్సుకు కళాశాల ఎంపిక కావడం నిజంగా గొప్ప విషయం. ఐటీ, ఐ-పాస్, ఫైనాన్షియల్, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రికల్చర్, జీఎస్‌డీపీ, ట్రాన్స్‌పోర్ట్ తదితర అంశాలపై సదస్సులో చర్చ జరగనుంది.

- డాక్టర్ నరేష్ గుమ్మడి, సెమినార్ కన్వీనర్, ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్

హైవేపై వారాంతపు రద్దీ



కేతేపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం వారాంతపు రద్దీ కొనసాగింది. శుక్రవారం హోలీ సందర్భంగా హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు వెళ్లిన ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు సోమవారం వారి విధులకు హాజరయ్యేందుకు ఆదివారం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో 65వ నెంబరు జాతీయ రహదారిపై హైదరాబాద్ లేన్ వాహనాలతో రద్దీగా మారింది. విజయవాడ లేన్‌లో అంతంతమాత్రంగా ఉన్న వాహనాలు హైదరాబాద్ లేన్‌లో మాత్రం బారులు తీశాయి. వాహనాల రద్దీ ఆదివారం మధ్యాహ్నం నుంచే ప్రారంభమవగా, సాయంత్రానికి మరింత పెరిగింది. దీంతో కొర్లపహాడ్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదిలాయి. వాహనాల రద్దీకి అనుగుణంగా టోల్‌ప్లాజాలోని 12టోల్ కౌంటర్లలో 7 హైదరాబాద్ వైపుకు వెళ్లే వాహనాలకు, ఐదు కౌంటర్లను విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు కేటాయించారు.

చలివేంద్రం ప్రారంభం

డిండి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాజుపల్లి గ్రామానికి చెందిన డైనమిక్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని యూత్ సభ్యుల సమిష్టి నిర్ణయం మేరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు వడ్లకొండ అల్లాజీ, సలహాదారులు వెంకటేష్, సోమిడి రమేష్, కొండల్, సత్యనారాయణ, వెంకటేష్, బాలకృష్ణ, అనిల్, ప్రశాంత్, గ్రామస్థులు హుస్సేన్, బాలయ్య, కృష్ణ, తిరుపతయ్య, యాదగిరి పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు హర్షణీయం

మిర్యాలగూడ అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న సేవాకార్యక్రమాలు హర్షణీయమని సోమేపల్లి సోమయ్య స్మారక సేవాసంస్థ చైర్మన్ పల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమావేశాన్ని ఆదివారం జిల్లాకేంద్రంలోని లయన్స్‌క్లబ్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందసేవా సంస్థలు తమ మరింతగా విస్తృతపరిచి పేదలు, అనాథలకు అండగా నిలువాలన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి పురుటినొప్పులు

● లక్ష్య ఛేదనలో వెనుకడుగు ● గతేడాదికంటే తగ్గిన ప్రసవాల సంఖ్య ● ప్రైవేటుకు రిఫర్‌చేస్తున్న వైనం

మిర్యాలగూడ అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రసవాల సంఖ్య మెరుగు పర్చుకోవడంలో ఏరియా ఆస్పత్రికి పురుటి నొప్పులు తప్పడం లేదు. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలవరీల సంఖ్య పెంచాలన్న లక్ష్యాన్ని చేరుకోవడంతో తడబాటు కనిపిస్తోంది. నిర్ణీత లక్ష్యాన్ని అధిగమించేందుకు ఉన్నతాధికారులు చేపట్టిన చర్యలు క్షేత్రస్థాయిలో ఆచరణ సాధ్యపడకపోవడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. మిర్యాలగూడ డివిజన్ పరిధిలో వందపడగలతో విస్తరించిన ఏరియా ఆస్పత్రి ప్రసూతివార్డులో మౌలిక సదుపాయాలు మెరుగుపడినప్పటికీ గర్భిణులకు మాత్రం ప్రసవవేదన తప్పడంలేదు. అత్యవసర సమయంలో ఆస్పత్రికొచ్చే గర్భిణులకు పురుడు పోసేందుకు సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పురిటి నొప్పులతో తల్లడిల్లిపోతున్న గర్భిణులను విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తున్నారు. మరోవైపు ఇక్కడికొచ్చే చాలా కేసులను నల్లగొండ జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్న నేపథ్యంలో అక్కడకు వెళ్లేంత సమయంలేక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వ ఉచిత వైద్యసేవలు దూరమై వేలాది రూపాయల బిల్లులు చెల్లించి కానుపు ప్రక్రియ పూర్తి చేసుకుంటున్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని మండలాలతోపాటు నాగార్జునసాగర్ నియోజవర్గంలో త్రిపురారం, నిడమనూరు, తిరుమలగిరి(సాగర్), అనుముల మండలాల ప్రజలు, గర్భిణులు తమకు అవసరమైన వైద్యసేవల కోసం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. ప్రతినెల సుమారు 150 మంది గర్భిణులు నెలసరి వైద్యపరీక్షల కోసం ఇక్కడకు వస్తుంటారు. కానుపు గడియలు దగ్గరపడిన సందర్భాల్లో మాత్రం ప్రసూతి వార్డులో వైద్యసేవలను అందించేందుకు నిరాసక్తి కనబర్చుతున్న నేపథ్యంలో ప్రైవేటు వైద్యమే శరణ్యమవుతోంది.

నలుగురు గైనిక్ డాక్టర్లున్నా..

నలుగురు గైనకాలిస్టులు ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. నెలసరి వైద్యసేవలను సజావుగా అందిస్తున్నప్పటికీ ప్రసవ గడియల్లో మాత్రం నామ మాత్రంగానే గైనిక్ సేవలు అందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్న ఆదేశాలను అమలు చేయడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. పురుటినొప్పులతో ఆస్పత్రికి వచ్చిన గర్భిణులను కనీసం 24 గంటలపాటు పర్యవేక్షణలో ఉంచాల్సి వస్తోంది. దీంతో గర్భస్థశిశువు ఎక్కడ ప్రమాదం వస్తోందన్న భయాందోళన, ఏదైనా జరిగితే తమపై నిందారోపణలు తప్పవన్న ఆలోచనతో వైద్యులు ఉన్నారు. దీంతో ప్రసూతి వార్డుకొచ్చే నిండు చూలాలను నల్లగొండ జిల్లాకేంద్ర ఆస్పత్రికి రిఫర్‌చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఏరియా ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య మెరుగుపడక ఏటా తగ్గుముఖం పడుతోంది. మరోవైపు ఒక్క గైనకాలజిస్టుతో పనిచేస్తున్న ప్రైవేటు ఆస్పత్రిలో ప్రతినెల సగటున వంద డెలివరీలు జరుగుతున్నప్పటికీ పెద్దాసుపత్రిలో మాత్రం కనీసం 80 డెలవరీలకు మించి జరగకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.





మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి, ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి(ఫైల్)

కలెక్టర్ ఆగ్రహించినా..

ఏరియా ఆస్పత్రి ప్రసూతి వార్డులో వైద్యసేవల నివేదికను రెండునెలల క్రితం కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. ఆస్పత్రిలో నలుగురు గైనకాలజిస్టులు పనిచేస్తున్నప్పటికీ ప్రసవాల సంఖ్య ఎందుకు మెరుగుపడడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశా కార్యకర్తల నివేదికలో నమోదైన గర్భిణులంతా ప్రసవాల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి ఎందుకు రావడంలేదు.. ఈ ఏడాది కాన్పుల సంఖ్య తగ్గడానికి కారణాలేమిటని కలెక్టర్ వైద్యులను ప్రశ్నించగా పొంతనలేని సమాధానంతో దాటవేశారు. దీంతో ఆగ్రహించిన కలెక్టర్ ప్రసూతి వైదసేవల్లో మార్పురావాలని, ఆదేశించినా ఇక్కడి వైద్యుల తీరులో ఏ మాత్రం మార్పులేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు



ప్రసూతివార్డులో ప్రసవాల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సాధారణ ప్రసవాలకు ప్రధాన్యమిస్తున్న క్రమంలో గర్భిణులను పర్యవేక్షణలో ఉంచాల్సి వస్తోంది. ఇలాంటి సందర్భాల్లో కొందరు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. దీంతో ప్రసవాల సంఖ్యలో కొంత వ్యత్యాసం జరుగుతోంది. ఈ ఏడాది మెరుగైన స్థాయిలో కాన్పుల సంఖ్య పెంచాలన్న లక్ష్యంతో సమిష్టిగా పనిచేస్తున్నాం.

డాక్టర్ శ్రీనివాస్‌సమరద్, ఏరియాఆస్పత్రి సూపరింటెండెంట్

● రెండేళ్లలో కాన్పులు ఇలా..

ఏరియా ఆస్పత్రిలో రెండేళ్ల వ్యవధిలో కాన్పుల నమోదు సంఖ్యను పరిగణిస్తే 2023 ఏడాదికంటే 2024లో ప్రసవాల నయోదు సంఖ్య తగ్గింది. గతంలో వైద్యుల పనితీరు సక్రమంగా ఉండడంతో ప్రసవాల సంఖ్య మెరుగైనస్థాయిలో నమోదైతే, 2024లో రిఫర్ కేసులు అధికం కావడంతో కాన్పుల సంఖ్య తగ్గిపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. 2023లో ఏరియా ఆస్పత్రిలో 1,230 కాన్పులు జరిగితే, 2024లో 1,169 కాన్పులు మాత్రమే నమోదయ్యాయి. ఈ ఏడాదిలోనైనా రిఫర్ కేసులను తగ్గించి వైద్యసేవలు మెరుగుపడితే తప్ప కాన్పుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది.

	2023	2024
జనవరి	106	107
ఫిబ్రవరి	98	74
మార్చి	15	40
ఏప్రిల్	64	98
మే	67	87
జూన్	120	94
జూలై	132	110
ఆగస్టు	122	104
సెప్టెంబరు	131	127
అక్టోబరు	123	121
నవంబరు	121	112
డిసెంబరు	131	95

పంటల బీమా అమలులో విఫలం

రైతు సంఘంనేత బంటు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న బంటు వెంకటేశ్వర్లు

వేములపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు అవసరమైన ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని మంగాపురంలో జరిగిన సంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత యాసంగిలో పంటలకు చీడపీడలు వ్యాపించడంతో పలుమార్లు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. రైతులు పంట నష్టపోయి అప్పుల్లో కూరుకుపోకుండా ఉండాలంటే రాష్ట్రంలో పంటల బీమా అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీని బేషరతుగా అమలు చేయాలని, రైతు భరోసా నిధులు ప్రతీరైతు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 23న చింతపల్లిలో జరిగే జిల్లా మహాసభలతోపాటు ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిజామాబాద్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర మహాసభలో రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, జిల్లా నాయకులు జిల్లా యాదగిరి, నాయకులు మున్నయ్య, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదగిరి, వెంకటేశ్వర్లు, సత్యం, వెంకన్న, రాములు, లక్ష్మయ్య, దామయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జగదీ‌ష్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వేములపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ పిలుపుమేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి మాట్లాడుతూ నిండు శాసనసభలో గౌరవ స్పీకర్ పట్ల సీనియర్ మంత్రిగా పనిచేసిన జగదీష్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా తన వ్యవహార శైలిని, మాట తీరును మార్చుకోకపోతే కాంగ్రెస్ నాయకులు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, నాయకులు పుట్టల పెద వెంకన్న, ఎస్‌కె హాజీ, బొంగర్ల వినోద్, దైద గిరి, మాతంగి చంటి, పెరుమళ్ల నగేష్, వెంకన్న, శ్రీనివాస్, ఎస్‌కె.సోహెల్, ఎండీ నవీద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రూ.2,800కు తగ్గకుండా కొనుగోలు చేయాలి

వేములపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని క్వింటా రూ.2800కు తగ్గకుండా కొనుగోలు చేయాలని మాజీ వైస్ ఎంపీపీ పాదరి గోవర్ధని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులోని మిల్లుల వద్ద ధాన్యం కొనుగోళ్లను ఆమె పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి, పతాని శ్రీను, ప్రణీత్‌రెడ్డి, సైదులు, విష్ణు, భిక్షం, వెంకన్న పాల్గొన్నారు.

కిరాణా దుకాణంలో రేషన్ బియ్యం విక్రయిస్తే చర్యలు

చింతపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా రేషన్ బియ్యాన్ని విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ తెలిపారు. ఆదివారం చింతపల్లిలోని పలు కిరాణ దుకాణాల్లో ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జాతీయ ఉత్పత్తి పథకం ద్వారా అందిస్తున్న రేషన్ బియ్యాన్ని వ్యాపారులు అధిక ధరకు తీసుకొని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వీటిని తిరిగి వినియోగదారులకు పాలిష్ చేసి విక్రయిస్తే, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

హాలియా, మార్చి16(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీకి చెందిన షేక్ మక్బూల్ కొద్ది రోజుల క్రితం పెరాలసిస్‌తో ఇబ్బందులు పడుతుండడంతో విషయం తెలుసుకున్న 1999-2000 బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు రూ.70వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న తోటి స్నేహితుడికి తమవంతు సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. మున్ముందు కూడా ఎవరు ఏ ఆపదలో ఉన్నా ఆదుకుంటామన్నారు. తోటి స్నేహితుడికి సహాయం అందజేసిన పూర్వ విద్యార్థులను నలంద విద్యాలయం ప్రధానోపాధ్యాయులు జలందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు యడవల్లి రాంబాలు అభినందించారు. కార్యక్రమంలో కే.రాజు, పి.వేణుగోపాల్, డి.రాజు, శేఖర్, శివకుమార్, ఖయ్యూం, నరేష్, జలందర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష

హాలియా, మార్చి16(ఆంధ్రజ్యోతి): అనుముల మండలం చల్మారెడ్డిగూడెం గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ పునర్ నిర్మాణానికి బీజేపీ రాష్ట్రనేత మన్నెం రంజిత్‌యాదవ్ ఆదివారం రూ.1,00,116 విరాళాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు ఆధ్యాతికతకు నిలయాలుగా విరాజిల్లుతున్నాయన్నారు. అదే విధంగా పెద్దవూర మాజీ ఎంపీపీ కూరాకుల అంతయ్యాయాదవ్ ఇటీవల కాలుకు సర్జరీ అయిన విషయాన్ని తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి ఆయన్ను పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అనుముల మండల మాజీ జడ్పీటీసీ రావుల భిక్షంయాదవ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు రావుల రాంబాబుయాదవ్, వెంపటి వెంకట్‌నారాయణ, రావుల సైదయ్య పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే ఉద్యోగాలు భర్తీ చేయాలి

నాగార్జునసాగర్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియమాకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లానేత ఆడెపు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఆదివారం ఆయన సాగర్ హిల్‌కాలనీలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరవధిక నరసన దీక్షను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అందుగుల రాజీవ్, రాహూల్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయనిధి

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉండి దరఖాస్తులు చేసుకున్న వారందరికీ సీఎం సహాయనిధిని అందజేసి ఆదుకుంటున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని గ్రామాలకు చెందిన 173 మంది బాధితులకు మంజూరైన రూ.30లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. వైద్య చికిత్సలకోసం అత్యవసర సమయంలో ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదలకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా అందించే వైద్యసేవల పరిమితిని రూ.5లక్షల నుంచి 10లక్షలకు పెంచినట్లు తెలిపారు. అనంతరం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవరకొండ, మాల్ మార్కెట్‌కమిటీ చైర్మన్లు నాయిని జమున మాధవరెడ్డి, దొంతం అలివేలు సంజీవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, కిన్నెర హరికృష్ణ, రాంసింగ్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

దామరచర్ల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): దామరచర్ల, తాళ్లవీరప్పగూడెం గ్రామాల నడుమ కొలువైన పొలిమేర ముత్యాలమ్మ జాతరను ఆదివారం పరిసర గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పొలిమేరా ముత్యాలమ్మ అమ్మవారు పొలిమేరలో ఉంటూ ప్రజలను, పంటలను కాపాడుతుందని భక్తుల విశ్వాసం. దామరచర్ల, తాళ్లవీరప్పగూడెం గ్రామాలతోపాటు వాడపల్లి, రాజగట్టు, నర్సాపురం తదితర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళల కోలాటం ఆకట్టుకుంది.

ఎమ్మెల్సీ మల్లన్నను కలిసిన నాయకులు



మల్లన్నతో నాయకులు శ్రీనివాస్ తదితరులు

చింతపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీ కుల ఐక్యవేదిక రాష్ట్రనేత దావా శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేయడానికి ముగ్గురు పిల్లల సంతానం ఉన్నవారికి అవకాశం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక ఎన్నికల్లో బీసీలకు అధిక ప్రాధాన్యం కల్పించి రాజకీయపరంగా ఎదగడానికి సహకరించాలన్నారు. ఆయన్ను కలిసిన వారిలో బీసీ సంఘం నాయకులు ముడిగ వెంకటయ్యయాదవ్, మాజీ సర్పంచులు కొప్పోల్ అమర్‌నాథ్, మర్ల ప్రేమలత వెంకటయ్య, అనంతుల మహేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ

చింతపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండల కేంద్రంలో ఈ నెల 18న సామాజిక తనిఖీని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుజాత ఆదివారం తెలిపారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కూలీలకు వేసవి కాలంలో తగిన జాగ్రత్త చర్యలకోసం సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

దేవరకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో లోవోల్టేజీతోపాటు విద్యుత్ సమస్యలను పరిష్కరించి రైతుల పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం దేవరకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంట పొలాలు ఎండిపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఎండిన పంటలకు రూ.30వేల పరిహారం ఇవ్వాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఆదుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రాంత ప్రజలకు వివరించాలని ఆయన నాయకులు, కార్యకర్తలను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిండి, ఎస్‌ఎల్‌బీసీ, పెండ్లిపాకల ప్రాజెక్టులను పూర్తిచేసి జిల్లా ప్రజలకు సాగునీరు అందించాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని గ్రామాలకు తాగునీరు అందించాలని కోరారు. ప్రజా సమస్యలపై బీజేపీ పోరాడుతుందన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్, కర్నాటి సురేష్, పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, చనమోని రాములు, ఏటి కృష్ణ, నక్క వెంకటేష్‌యాదవ్, గుండాల అంజయ్య యాదవ్, అంకూరి నర్సింహ, జల్దా భాస్కర్, నేతాళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి

ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



నిరసనలో పాల్గొన్న కోటిరెడ్డి, పార్టీ నాయకులు

గుర్రంపోడు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ రాష్ట్రనేత పాశం గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. రుణమాఫీ, రైతుభరోసా, పెన్షన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు సత్తా చాటాలన్నారు. అనంతరం మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అసెంబ్లీ నుంచి సస్పెన్షన్‌కు నిరసనగా నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేశారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పోలె రామచంద్రం, బాల్‌రెడ్డి, వడ్త్య రజిత నాగరాజు, మారం గోపాల్‌రెడ్డి, కన్నెబోయిన అంజయ్య, నాయకులు రాజేష్‌రెడ్డి, శ్రీరాములు, కూనూరు సైదిరెడ్డి, యాదయ్య, ప్రశాంత్‌రెడ్డి, లింగయ్య, నాగిరెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

జగదీష్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తేయాలి

● మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

నాగార్జునసాగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిని అసెంబ్లీనుంచి సస్పెన్షన్ చేయడాన్ని వెంటనే ఎత్తేయాలని మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన ఎమ్మెల్సీ కోటిరెడ్డితో కలిసి సాగర్ పైలాన్ కాలనీకి చెందిన ఆలిండియా బంజారా సేవా సంఘంనేత శివాజీ ప్రథమ వర్ధంతికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల మంత్రిగా ఉన్న జగదీష్ రెడ్డి ఉమ్మడి జిల్లాను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. జగదీష్‌రెడ్డి అసెంబ్లీలో చాలా స్పష్టంగా మాట్లాడినా అన్ పార్లమెంటరీ భాషను వాడరని సస్పెండ్ చేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటరెడ్డి, బీఆర్‌ఎస్‌నేతలు రవినాయక్, లక్ష్మణ్‌నాయక్, చంద్రమౌళీనాయక్, వెంకటయ్య, హరి నాయక్, శ్రీకర్ నాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, పక్కన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

వీటీ నగర్ కొండపై బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చింతపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలం గొడుకొండ్ల(వీటీ నగర్) కొండపై నెలకొన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా రామలింగేశ్వర స్వామి ఆలయంనుంచి ఉత్సవ విగ్రహాలను చైర్మన్ నేతృత్వంలో కొండపైకి తీసుకెళ్లారు. విశ్వక్సేన పూజ, స్వస్తిపుణ్యావాచనం, అఖండ దీపారాధన, దీక్షబంధనం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ పూరె లక్ష్మణ్, ధర్మకర్తలు మద్దెల కృష్ణ, గడ్డం ఆంజనేయులు, కోడిదూటి లక్ష్మమ్మ జంగయ్య, చేపూరి నారాయణచారి, అర్చకులు దేరం భాస్కర్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ, పాండే పాల్గొన్నారు.

తీదేడులో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

చింతపల్లి మండలంలోని తీదేడు(వెంకటంపేట)లో రామలింగేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు మాజీ సర్పంచి కాయితి జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో జరుపుతున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ధరణిపతి రమణారావు, కొరివి యాదయ్య, దాసరి శ్రీనివాస్ యాదవ్, కృష్ణమాచారి, రాధకృష్ణ, సురభి కృష్ణమూర్తిశర్మ పాల్గొన్నారు. రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తీదేడులో మంగళవారం రథోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించడానికి అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు.



సత్యనారాయణస్వామి వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు